## విలేకరులు కావలెను

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :49 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 12 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool





### క్రీడలే వారధి.. భారత్-న్యూజిలాండ్ మధ్య
## శతాబ్దపు క్రీడా సంబంధాలు

- క్రీడలు దేశాల మధ్య శక్తిమంతమైన వారధిగా పనిచేస్తాయన్న ప్రధాని మోదీ
- న్యూజిలాండ్‌తో శతాబ్దపు క్రీడా సంబంధాలను గుర్తు చేసుకున్న ప్రధాని
- ఆక్లాండ్‌లో న్యూజిలాండ్ ప్రధానితో కలిసి స్పోర్టింగ్ షోకేస్‌లో పాల్గొన్న మోదీ
- ఆస్ట్రేలియాతోనూ క్రీడా సహకారం కోసం ప్రత్యేక రోడ్‌మ్యాప్ ప్రారంభం



### ముంబయిలో పవన్ కల్యాణ్‌కు
## శస్త్రచికిత్స విజయవంతం

- త్వరగా కోలుకోవాలని సీఎం, లోకేశ్ ఆకాంక్ష
- ముంబయిలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆపరేషన్
- కుడి భుజానికి మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్స
- ఆపరేషన్ రూమ్ నుంచి రికవరీ గదికి తరలింపు

అమరావతి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. శనివారం ముంబయిలోని ఓ ఆస్పత్రిలో ఆయనకు వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం ఆయనను ఆపరేషన్ రూమ్ నుంచి రికవరీ రూమ్‌కు తరలించినట్లు వైద్య బృందం వెల్లడించింది. పవన్ కల్యాణ్ గత కొంతకాలంగా భుజాల నొప్పితో బాధపడుతున్నారు. ఇటీవల ఆయనకు వైద్యులు పలు పరీక్షలు నిర్వహించారు. ఆయన రెండు భుజాలకు 'రొటేటర్ కఫ్' గాయాలు ఉన్నట్లు గుర్తించారు. కండరాలు పూర్తిగా చిట్లిపోయాయని నిర్ధారించారు. దీంతో - మిగతా 3లో


### జనాభా నియంత్రణ కాదు
# సంరక్షణే ముఖ్యం



- పిల్లలే మన సంపదని, పెద్ద కుటుంబాలే శ్రీరామరక్ష
- విజయవాడ ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి
- దక్షిణాదిలో పడిపోతున్న ఫెర్టిలిటీ రేటు, మైక్రో ఫ్యామిలీల ఆలోచన ప్రమాదకరమన్న చంద్రబాబు
- కొన్ని దేశాలతోపాటు భారత్‌లో దక్షిణాదిలోనూ జనాభా గణనీయంగా తగ్గిపోతోంది
- మన అభివృద్ధి సమతుల్యం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకం

అమరావతి

పిల్లలే మన సంపదని, పెద్ద కుటుంబాలే శ్రీరామరక్షని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. మారిన పరిస్థితుల ప్రకారం జనాభా నియంత్రణ కాదు, జనాభా సంరక్షణే ముఖ్యమని ఆయన పిలుపునిచ్చారు. కొన్ని దేశాలతోపాటు భారత్‌లో దక్షిణాదిలోనూ జనాభా గణనీయంగా తగ్గిపోతోందని గుర్తు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇకనైనా మేలకోవడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. మన అభివృద్ధి సమతుల్యం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకమని చెప్పారు. విజయవాడలోని అంబేడ్కర్ కళావేదికలో జరిగిన ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పిల్లలే సంపద కార్యక్రమానికి ఇవాల్టి నుంచే నాంది - మిగతా 3లో



### ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే

- ఏఐ యుద్ధాలు చేసినా గెలిచేది సైనికులేనన్న రాజ్‌నాథ్
- విశాఖలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి నౌకాదళంలోకి ప్రవేశం
- సంప్రదాయ, ఆధునిక సైనిక శక్తి మధ్య సమతుల్యం అవసరం
- యుద్ధనౌకల నిర్మాణంతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు
- 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'తో ప్రపంచ హబ్‌గా భారత్

## వియత్నాంలో ఘోర ప్రమాదం..

- ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక...
- 15 మంది మృతి
- వియత్నాంలో భారత పర్యాటకులతో వెళుతున్న స్పీడ్‌బోట్ బోల్తా
- ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమం
- ఫు క్వాక్ దీవి సమీపంలో అదుపుతప్పిన పడవ
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. సహాయక చర్యలు ముమ్మరం





### ధవళేశ్వరం మరింత
# పటిష్ఠం

- కొత్తగేట్లు అమర్చే పనుల్ని ఈనెల 13న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త గేట్ల ఏర్పాటుకు శ్రీకారం
- రూ.153 కోట్లతో 117 పాత గేట్ల స్థానంలో కొత్తవి
- ఈనెల 13న పనులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- పిచ్చుకలంకలో రైతులతో భేటీ, పోలవరం ప్రాజెక్టు పరిశీలన
- సీడబ్ల్యూసీ సిఫార్సుల మేరకు బ్యారేజీ ఆధునికీకరణ

అమరావతి

ఉభయ గోదావరి జిల్లాలకు జీవనాడిగా, లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీరు అందిస్తున్న సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ ఆధునికీకరణకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాలం చెల్లిన పాత గేట్ల స్థానంలో కొత్తవి అమర్చే పనులను ఈ నెల 13న ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ బృహత్ కార్యక్రమం ద్వారా బ్యారేజీని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ముందడుగు వేసింది. బ్యారేజీ గేట్లను నిర్మించి 50 ఏళ్లు దాటడంతో వాటి సర్వీస్ లైఫ్ ముగిసిందని, - మిగతా 3లో

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం
# ఎంతో కుదేలైంది

- ఉద్యోగ సంఘాలతో మంత్రుల బృందం చర్చ
- శ్రీకాకుళంలో తలపెట్టిన ఉద్యమ సన్నాహక సభ తాత్కాలిక వాయిదా
- అమరావతి జేఏసీ ఉద్యోగ సంఘాలతో మంత్రుల బృందం చర్చలు
- 23 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసిన ఉద్యోగ నేతలు
- సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన కూటమి ప్రభుత్వం



అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తమకు రావాల్సిన బకాయిలు, డీఏలు, పీఆర్సీ సహా పలు డిమాండ్లపై గళం విప్పుతున్న ఉద్యోగులతో ప్రభుత్వం చర్చల ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా సచివాలయంలో ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘం నేతలతో మంత్రుల బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి ఈ చర్చల్లో పాల్గొని ఉద్యోగుల సమస్యలను సావధానంగా విన్నారు. ఈ దఫా చర్చలు సఫలం కావడంతో ఉద్యోగులు ఆందోళన బాట వీడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని - మిగతా 3లో

### ఈ నెల 14న తెలంగాణ వ్యాప్తంగా కళాశాలల బంద్

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్న ఏబీవీపీ
- వీటిపై ఆధారపడి 20 లక్షల మంది విద్యార్థులు చదుకుంటున్నారని వెల్లడి
- ప్రభుత్వం, ప్రైవేట్ కాలేజీలు కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నాయని మండిపాటు






### రామ మందిర నిర్మాణ పనులన్నీ జులై 30నాటికి పూర్తవుతాయి

- రామమందిర నిర్మాణ పనులపై కీలక వ్యాఖ్యల చేసిన కమిటీ ఛైర్మన్
- జులై 30 నాటికి ప్రధాన ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని వెల్లడించిన నృపేంద్ర



### న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్లకుకోర్టు నోటీసులు

కొత్త ఎయిర్‌ఫోర్స్‌వన్‌పై కథనాలే కారణం

# జనాభా నియంత్రణ కాదు సంరక్షణే ముఖ్యం

-మొదటిపేజీ తరువాయి

పలుకుతున్నామని ప్రకటించారు. దేశమంటే మట్టికాదోయ్- దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పిన మాటల్ని మరోమారు గుర్తు చేశారు. జనాభా నియంత్రణ కాదు, జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుందని వెల్లడించారు. గతంలో జనాభా నియంత్రణపై ఆలోచన చేశామని, దానికి అనుగుణంగా ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టాయని చెప్పారు.

**ఇప్పుడు విధానం మారింది**

మహిళల్లో అక్షరాస్యత పెరిగితేనే జనాభా నియంత్రణ సాధ్యమని అప్పట్లో ఆలోచన చేశామని స్థానిక సంస్థల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హత అనే నిబంధనలు కూడా పెట్టారని గుర్తు చేశారు. ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి, ముగ్గురు వద్దు లాంటి ప్రచారాలు చేశామని ఇప్పుడు విధానం మారిందని సీఎం చెప్పారు. 20 ఏళ్ల క్రితం ఐటీ లాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని సంపద సృష్టించామని, ఇప్పుడు ప్రపంచంలోని ఏ దేశానికి వెళ్లినా తెలుగువాళ్లు ఉంటారని చెప్పారు. అప్పుడు ఐటీ, ఇప్పుడు ఏఐ గురించి మాట్లాడుతున్నానని, తాజాగా జనాభా నిర్వహణ గురించి కూడా చర్చిస్తున్నామని చెప్పారు. టోటల్ ఫెర్టిలిటీ రేట్ మన రాష్ట్రంలో పడిపోయిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో జనాభా గణనీయంగా తగ్గిపోతోందని, భారత్?లో దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి కూడా అదేనని చెప్పారు. ఎలాంటి అభివృద్ధి అయినా జనాభా ఉంటేనే అది సార్ధకం అవుతుందని చెప్పారు. మైక్రో ఫ్యామిలీల గురించి యువత ఆలోచన చేయటం ప్రమాదకరమన్నారు. మన అభివృద్ధి సమతుల్యం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నొక్కిచెప్పారు.

**చిన్నారుల సంఖ్య తగ్గుతోంది**

ప్రస్తుతం రాష్ట్రంలో జనాభా తగ్గిపోవడం వల్ల ఏర్పడుతున్న ప్రభావాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు. అంగన్వాడీలు, ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారుల సంఖ్య తగ్గుతోందని, అదే సమయంలో వృద్ధుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ వంద మంది జనాభాలో 89శాతం మందికి మొదటి, రెండో సంతానం




లేదని, ఏపీలోని విశాఖపట్నం లాంటి జిల్లాల్లో ఫెర్టిలిటీ రేటు అతి తక్కువగా ఉందన్నారు. ఏపీ విస్తీర్ణంలో 7వ స్థానంలో ఉన్నా పాపులేషన్ డెన్సిటీలో తక్కువ స్థాయిలో ఉన్నామని చెప్పారు. పిల్లలే సంపద అనే విధానాన్ని రాష్ట్రప్రభుత్వం తీసుకుంటోందన్నారు.

జనాభా సంరక్షణ అనేదే ఈ సమయంలో కీలకమని జనాభా పెంచాలని మాట్లాడితే విమర్శలు వచ్చాయని చెప్పారు. పిల్లలను పెంచటం అనేది కేవలం మహిళల బాధ్యత మాత్రమే కాదని, స్త్రీ-పురుషుల ఉమ్మడి బాధ్యతని చెప్పారు. కాన్పుల్లో సిజేరియన్లు తగ్గించాల్సిన అవసరం ఉందని, మహిళల ఆరోగ్య సంరక్షణ అత్యంత కీలకమన్నారు. ఇవాళ తెలంగాణాలో పోక్సో నిందితుడు కేసు పెట్టినవారి కుటుంబాన్ని, తన సొంత కుటుంబాన్ని హత్య చేశాడని ఇది అత్యంత దారుణమైన ఘటనగా అభివర్ణించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతారహితంగా వినియోగించటం, అసభ్యకరమైన, హింసాత్మక దృశ్యాలను నియంత్రించాలని చెప్పారు.

**జనాభాను ప్రోత్సహించాలి**

సోషల్ మీడియా వ్యసనంగా మారితే ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతాయని చెప్పారు. సాంకేతికత, ఆధ్యాత్మికత ద్వారా యువతకు ప్రపంచాన్ని జయించే శక్తి సొంతం అవుతుందని చెప్పారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం సంజీవని కార్యక్రమం చేపట్టామని, మహిళలకు పనిచేసే చోట్ల చైల్డ్ కేర్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యువతతోపాటు పెద్దవాళ్లు కూడా నిరంతరం సమాజహితం కోసం ఆలోచన చేస్తూ ఆస్తిగా తయారు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో తల్లికి వందనం కింద ప్రతీ ఒక్కరికీ రూ.15వేల చొప్పున ఇస్తున్నామని, జనాభాను ప్రోత్సహించడమే దీని ఉద్దేశమని టెప్పారు.

2047 నాటికి మన తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేర్చాలన్నదే సంకల్పమని చెప్పారు. జనాభా లేకపోతే మనం చేసుకున్న అభివృద్ధి లక్ష్యాలను సాధించలేమని చెప్పారు. 15 శాతం వృద్ధిరేటుతో లక్ష్యాల మేరకు ముందుకు వెళ్తే 2040 నాటికే స్వర్ణాంధ్ర సాధించగలుగుతామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ప్రజలతో సంప్రదించి పిల్లలే సంపద కార్యక్రమాన్ని చేపడతామని, పాపులేషన్ మేనేజ్మెంట్ అనేది ఒక రియాలిటీ అని గుర్తించాలని చెప్పారు. కుటుంబ వ్యవస్థ భారత్?కే సొంతమైన ఓ అద్భుతమైన వరమని, ఈ వారసత్వాన్ని మనం అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కుటుంబ వ్యవస్థను కాపాడుకుని ప్రపంచానికే ఆదర్శంగా మనం అంతా నిలవాలని కోరారు. జనం ఉంటేనే అభివృద్ధి అని, జనాభా ఉంటేనే నిజమైన భవిష్యత్తని సీఎం అభిప్రాయపడ్డారు. పిల్లలే సంపద -పెద్ద కుటుంబమే శ్రీరామరక్షని, దీనిని ప్రజలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

"జనాభా నియంత్రణ కాదు, జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుంది. ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి, ముగ్గురు వద్దు లాంటి ప్రచారాలు చేశాం. ఇప్పుడు విధానం మారింది. 20 ఏళ్ల క్రితం ఐటీ లాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని సంపద సృష్టించాం. టోటల్ ఫెర్టిలిటీ రేట్ మన రాష్ట్రంలో పడిపోయింది."

సమావేశానికి ముందు సీఎం చంద్రబాబు నాయుడు స్టాళ్లను పరిశీలించారు. సమావేశం అనంతరం జనాభాపై ప్రభుత్వ విధానానికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా హాజరయ్యారు.

# రెడ్ ఫ్లాగ్‌తో వైసీపీ...

**విజయవాడ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక విషయంలో చాలా గర్వపడుతూ వస్తోంది. తాము ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి వచ్చామని గొప్పగా చెప్పుకుంటూ ఉంటుంది. కానీ మొన్నటి ఎన్నికల్లో ఓటమితో ఆ పార్టీకి అసలు సినిమా అర్థమయింది. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా వెళ్తే ఇబ్బందికరమని ఆ పార్టీ భావిస్తోంది. అలాగని ఆ పార్టీతో కలిసివచ్చే పార్టీలు లేవు. దానికి కారణం జగన్మోహన్ రెడ్డి స్వయంకృతాపం. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క పార్టీతో కూడా చెలిమి లేదు. అసలు ఇతర రాజకీయ పార్టీలను లెక్క చేసేవారు కాదు. ఇప్పుడు అదే ఆ పార్టీకి మైనస్. ఆ పార్టీతో జత కలిసేందుకు ఏ పార్టీ ముందుకు రాని పరిస్థితి. అయితే ఇప్పుడు వామపక్షాల్లో ఒకటైన సిపిఐ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కలుస్తోంది. కానీ అది ప్రభుత్వంపై పోరాటం చేసే క్రమంలో. ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శించే క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అనుసరిస్తోంది సిపిఐ. తాజాగా జోసెఫ్ రావణ్ అరెస్ట్ విషయంలో స్పందించారు సిపిఐ నారాయణ. ప్రభుత్వ చర్యలను తప్పుపడుతున్నారు. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో సిపిఐ జతకలుస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.దేశవ్యాప్తంగా వామపక్షాలు ఉనికిని కోల్పోయాయి. చివరకు కేరళలో సైతం ఆ పార్టీ చేతులెత్తేసింది. కానీ ఇప్పటికీ ప్రజా సంఘాల రూపాల్లో వామపక్షాలు బలంగా ఉన్నాయి. అయితే వామపక్షాల అవసరం అధికార పార్టీలకంటే ప్రతిపక్షాలకి ఎక్కువగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలు చేయాలంటే వామపక్షాల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇంకా రెండున్నర సంవత్సరాలు మాత్రమే ఉండడంతో కచ్చితంగా ప్రజా పోరాటాలు చేయాల్సి ఉంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే వామపక్షాలను కలుపు కెళ్తే మంచి ప్రయోజనం ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో



పొత్తు పెట్టుకుని తక్కువ సీట్లు విడిచిపెట్టిన అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లాభం అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.వచ్చే ఎన్నికల్లో ఆ మూడు పార్టీలు కూటమిగా ముందుకు వెళ్లడం ఖాయం. మరో 15 ఏళ్ల పాటు కలిసి ఉంటామని పవన్ కళ్యాణ్ తేల్చి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరి పోరాటం చేస్తే మాత్రం ఆ పార్టీకి ఇబ్బందికరమే. మొన్నటి ఎన్నికల వరకు ఒక ఎత్తు.. అంతకు ముందు పరిస్థితి వేరు.. మునుపటి మాదిరిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడుగా వ్యవహరించలేదు. ఆపై చాలా వర్గాలు దూరమయ్యాయి. తనకున్న సంప్రదాయ ఓటు బ్యాంకుకు తోడు వామపక్షాల బలం లభిస్తే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం ఉంటుంది. లేకుంటే కష్టం అన్న టాక్ ఉంది. ముఖ్యంగా సిపిఐ లాంటి పార్టీతో దూకుడుగా ముందుకు సాగితే కొన్ని జిల్లాల్లో ప్రభావం చూపవచ్చు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదానికి సంబంధించి మంత్రి నారా లోకేష్ ను నిలదీసింది సిపిఐ నేతలు. జగన్మోహన్ రెడ్డి పర్యటనలో సైతం సీపీఐ నేతలు కనిపించారు. అందుకే సిపిఐ తో వైసీపీ పొత్తు ఉంటుందన్న అనుమానం వ్యక్తం అవుతోంది. మరి జగన్ మనసులో ఏముందో తెలియాలి.

# చిత్తూరు జిల్లాల్లో బంగారు గనులు

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమలో బంగారు గనుల అన్వేషణలో ఉంది. కర్నూలు జిల్లా జొన్నగిరి, చిత్తూరు జిల్లా కుప్పంలో బంగారు గనుల్ని గుర్తించగా.. శ్రీసత్యసాయి జిల్లా జౌకల, రామగిరి ప్రాంతంలో గనులు ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో పరిశోధనలు చేసి త్వరలోనే స్పష్టతకు రానున్నారు. జౌకల ప్రాంతంలో మొత్తం ఆరు బ్లాకులు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం నాలుగు దశల్లో బంగారం నిక్షేపాలపై రీసెర్చ్ చేసి నివేదికను సమర్పించను న్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బంగారం నిక్షేపాలు ఒక్కొక్కటిగా బయటుకొస్తున్నాయి. ఇటీవల కర్నూలుజిల్లా జొన్నగిరిలో బంగారం గనులు ప్రారంభంకాగా.. చిత్తూరు జిల్లా కుప్పంలోనూ బంగారు గనులున్నాయని గుర్తించారు. తాజాగా సత్యసాయి జిల్లాలో బంగారం నిక్షేపాలు ఉన్నాయని తేలింది. రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి జిల్లాలోని ఎన్పీకుంట మండలం జౌకల ప్రాంతంలో ఖనిజాన్వేషణ ప్రక్రియను వేగవంతం చేసింది. గతంలోనే ఇక్కడ భారీగా బంగారం నిక్షేపాలు ఉన్నాయని పరిశోధనల్లో తేలింది. ఈ ప్రాంతంలో బంగారం ఎంతమేరకు ఉందో స్పష్టత కోసం రీసెర్చ్ చేసేందుకు సిద్ధమయ్యారు. బంగారాన్ని అన్వేషించేందుకు ఆరు ప్రైవేట్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించారు. జౌకల ప్రాంతంలో మొత్తం ఆరు బ్లాకులు ఉండగా.. నాలుగు దశల్లో పరిశోధన చేయనున్నారు. ఈ పరిశోధనలు పూర్తయ్యాక నివేదికల్ని



పరిశీలించి బంగారం నిక్షేపాలపై ఒక అవగాహనకు వచ్చాక మైనింగ్‌కు అనుమతిస్తారు.వాస్తవానికి 2015లోనే శ్రీ సత్యసాయి జిల్లా జౌకల ప్రాంతంలో ఉన్న ఆరు బ్లాకుల్లో బంగారం నిక్షేపాలపై మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ట్రస్ట్ పరిశోధనలు చేసింది. కర్ణాటకలోని కోలార్ గ్రీన్‌స్టోన్ బెల్ట్‌తో ఈ ప్రాంతం పోలి ఉందని.. నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. 2022లో ఈ పరిశోధనలు జీ4 దశలో ఆగిపోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా ఏపీ ప్రభుత్వం ఆగిపోయిన జీ4 దశ నుంచి మళ్లీ బంగారం నిక్షేపాలపై పరిశోధనల్ని ప్రారంభించనుంది. ఈ ప్రాంతంలో పూర్తిస్థాయిలో పరిశోధనల తర్వాత స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఒకవేళ నిక్షేపాలు ఉంటే తవ్వకాలకు అనుమతి ఇస్తారు.ప్రస్తుతం బంగారం నిక్షేపాలు ఉన్నాయని చెబుతున్న జౌకల వెలిగల్లు గ్రీన్‌స్టోన్ బెల్ట్ కొత్తపల్లి బ్లాక్ ప్రాంతంలో ఉంది. ఈ ఏరియాలో ఆరు బ్లాకుల్లో 5,560 హెక్టార్లలో పూర్తిస్థాయి పరిశోధనలు చేయనున్నా?. 2001లోనే ఇక్కడ ప్రాథమికంగా బంగారం నిక్షేపాల కోసం అన్వేషించగా.. ఓ సంస్థ ఖనిజాన్వేషణ చేసేందుకు లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకుంది.. కానీ ఆ తర్వాత అడుగులు ముందుకు పడలేదు. జౌకల ప్రాంతం మాత్రమే కాదు రామగిరి, రొద్దం ప్రాంతంలోనూ బంగారు నిక్షేపాలు ఉన్నాయని గుర్తించారు. ఇక్కడ గనుల్ని వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని ఆలోచన చేస్తోంది ప్రభుత్వం.కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో ఇటీవల బంగారు గనుల్లో ఉత్పత్తి ప్రారంభమైంది. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బంగారానని వెలికితీస్తోంది. తాజాగా చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో బంగారు గనులు ఉన్నట్లు గుర్తించారు. గుడుపల్లె మండలం చిగురుగుంట-బిసానత్తం బ్లాక్‌లో బంగారం ఉందని తేల్చారు. ఈ ప్రాంత కర్ణాటకలోని కేజీఎఫ్ ప్రాంతానికి 27 కిలోమీటర్ల దూరంలో ఉండటం విశేషం. ఈ ఏడాది ఈ బంగారు గనుల కోసం టెండర్ల పిలిచి అనంతరం రద్దు చేశారు. తాజాగా మరోసారి టెండర్లు పిలవాలని భావిస్తున్నారు. మొత్తానికి రాయలసీమలోని కర్నూలు, చిత్తూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో బంగారం బయటపడింది.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఎంతో కుదేలైంది

-మొదటిపేజీ తరువాయి

మంత్రులు స్పష్టం చేశారు. ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘం నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులతో మంత్రులు భేటీ అయ్యారు. సంఘం నేతలు మొత్తం 23 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రులకు అందజేశారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ కమిషన్ ఏర్పాటుపై ఇరువర్గాలు చర్చించాయి. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై ప్రాథమికంగా మాట్లాడుకున్నారు. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఉద్యోగులకు జరిగిన మేలును నేతలు గుర్తు చేసుకున్నారు.

**ఆర్థిక విధ్వంసం వల్లే జాప్యం**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఎంతో కుదేలైందని మంత్రులు ఉద్యోగులకు వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసం కారణంగానే ఉద్యోగులకు ఇప్పుడు వెంటనే న్యాయం చేయలేకపోతున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు, ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను నేతలకు వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు సైతం అర్థం చేసుకోవాలని మంత్రులు కోరారు.

**21న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ భేటీ**

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమైన సమావేశాల వల్ల ఈ భేటీకి హాజరు కాలేకపోయారు. ఆయన అందుబాటులో ఉండేలా ఈనెల 21న గానీ లేదా అంతకంటే ముందే మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. 21వ తేదీన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ నిర్వహించనున్నారు. అన్ని ఉద్యోగ సంఘాల అభిప్రాయాలు తీసుకుని, ఒక సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని మంత్రులు హామీ ఇచ్చారు. పీఆర్సీ, ఏరియర్స్, డీఏల చెల్లింపులపై రాష్ట్ర పరిస్థితిని బట్టి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. "అమరావతి జేఏసీ ఉద్యోగ సంఘాలతో మేం సానుకూలంగా చర్చలు జరిపాం. వారు మొత్తం 23 డిమాండ్లను మా ముందు ఉంచారు. ప్రతి డిమాండ్ మీద ప్రాథమికంగా చర్చించాం. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్లే రాష్ట్ర పరిస్థితి కుదేలైందని వివరించాం. ఆర్థిక మంత్రి అందుబాటులో లేకపోవడంతో, 21వ తేదీలోగా మరోసారి భేటీ అవుతాం.

**ఉద్యమ కార్యాచరణ వాయిదా**

మంత్రులతో చర్చలు సఫలం కావడంతో ఏపీ జేఏసీ అమరావతి నేతలు మెత్తబడ్డారు. ప్రభుత్వంతో సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగిన నేపథ్యంలో ఉద్యమ కార్యాచరణను వాయిదా వేసుకుంటున్నట్లు నేతలు ప్రకటించారు. రేపు శ్రీకాకుళంలో తలపెట్టిన ఉద్యమ సన్నాహక సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కాగా, భవనాలపై పన్నుల విధింపు, ఆర్టీసీ ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం వంటి అంశాలపై కూడా ఉద్యోగ నేతలు ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. వాటిని కూడా సీఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రులు భరోసా ఇచ్చారు. "రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళు న్నప్పుడు ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య ఎలాంటి గ్యాప్ ఉండకూడదన్నదే మా లక్ష్యం. ఉద్యోగ సంఘాలు అడిగే డిమాండ్లలో న్యాయం ఉంది. ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం దిశగా వెళ్తున్నాం. మా చర్చలతో వారు ఉద్యమ బాటను తాత్కాలికంగా ఆపుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రితో చర్చించి రాష్ట్ర పరిస్థితికి అనుగుణంగా ఏది ఎప్పుడు చేయగలమో స్పష్టమైన కార్యాచరణను ప్రకటిస్తాం."

## ముంబయిలో పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతం

-మొదటిపేజీ తరువాయి

శస్త్రచికిత్స తప్పనిసరి అని వైద్యులు సూచించారు. అయితే రెండు భుజాలకు ఒకేసారి ఆపరేషన్ చేస్తే నొప్పి తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అందుకే ప్రస్తుతానికి కుడి భుజానికి మాత్రమే సర్జరీ చేశారు. సుమారు మూడున్నర గంటల పాటు శ్రమించి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. మరో రెండు నెలల వ్యవధిలో ఎడమ భుజానికి రెండో సర్జరీ చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు.


**గాయాలు ఎలా అయ్యాయంటే**

పవన్ కల్యాణ్‌కు ఈ గాయాలు ఒకేసారి అయినవి కావు. గతంలో పవన్ నటించిన బ్లాక్ బస్టర్ 'గబ్బర్ సింగ్' సినిమా షూటింగ్ సమయంలో ఆయనకు తీవ్రమైన దెబ్బలు తగిలాయి. ఆ తర్వాత రాజకీయాల్లో బిజీ అయ్యారు. 2019లో జరిగిన రాయలసీమ జిల్లాల పర్యటనలోనూ ఆయన గాయపడ్డారు. అలాగే ఇటీవలి ఎన్నికల ముందు చేపట్టిన వారాహి యాత్ర సమయంలోనూ అభిమానుల తాకిడికి ఆయనకు గాయాలు అయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పవన్ ముక్కుకి ఓ చిన్న శస్త్రచికిత్స జరిగింది. ఆ ఆపరేషన్ చేసే సందర్భంలో వైద్యులు పలు పరీక్షలు నిర్వహించారు. అప్పుడే ఆయన భుజాలకు రొటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు గుర్తించారు.

**'పూర్తి శక్తిని పుంజుకోవాలి'**

పవన్ కల్యాణ్ ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల పలువురు ప్రముఖులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా స్పందించారు. పవన్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేశ్ కూడా ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. "పవన్ అన్నకు ఆపరేషన్ సాఫీగా జరగాలని కోరుకుంటున్నా. పవన్ అన్న త్వరగా కోలుకోవాలి. సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ, ఆయన తన పూర్తి శక్తిని పుంజుకోవాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నా" అని లోకేశ్ పేర్కొన్నారు. పవన్‌కు శస్త్రచికిత్స విజయవంతం అయినందుకు ఎంతో సంతోషంగా ఉందని ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్ పోస్ట్ పెట్టారు. ఆయన త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

## ధవళేశ్వరం మరింత పటిష్ఠం...



-మొదటిపేజీ తరువాయి

వాటిని మార్చాలని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) గతంలోనే సిఫార్సు చేసింది. ఈ సూచనల మేరకు, ప్రస్తుత ప్రభుత్వం బ్యారేజీ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఆధునికీకరణ పనులకు పరిపాలనా ఆమోదం తెలిపింది. మొత్తం రూ.152.95 కోట్ల వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా, శిథిలావస్థకు చేరిన 117 ఫ్లడ్ గేట్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో అధునాతనమైన కొత్త గేట్లను బిగించనున్నారు. దీంతోపాటు, 12 హెడ్ స్లూయిజ్ గేట్లకు మరమ్మతులు, 175 క్రెస్ట్ గేట్లకు కొత్త రబ్బరు సీల్స్, 734 రోలర్ బేరింగ్స్ అమర్చనున్నారు. బీఈసీఓఎమ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ పనులను దక్కించుకోగా, రెండేళ్లలో పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించనుంది. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం చూపిందన్న విమర్శలు ఉన్నాయి. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని, ధవళేశ్వరం బ్యారేజీ విషయంలోనూ కనీస మరమ్మతులు చేపట్టలేదని ఆరోపణలు వచ్చాయి. అయితే, 2014లో టీడీపీ ప్రభుత్వం రూ.31.77 కోట్లతో 58 గేట్లకు మరమ్మతులు చేయించింది. ఇప్పుడు పూర్తిస్థాయి ఆధునికీకరణకు నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ఈ నెల 13న ఉదయం 10:25 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, 11:25 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నూతన గేట్ల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 11:45 గంటలకు ఆత్రేయాపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:20 గంటలకు పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. అక్కడ ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 2 పనులు, పవర్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 5:20 గంటలకు పోలవరం పర్యటన ముగించుకుని తిరిగి అమరావతికి చేరుకుంటారు.

# బుద్దవరంలో ఆధునీకరించిన పీఏసీఎస్ భవనం ప్రారంభం.

- భవనాన్ని ప్రారంభించిన కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే యార్లగడ్డ.
- ఎద్దుల బండి పై ర్యాలీగా కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు.
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకార రంగమే వెన్నెముక నెట్టెం రఘురామ్.
- రైతులు, చేతివృత్తిదారులకు సహకార సంఘాల ద్వారా రుణాలు నెట్టెం.
- సహకార్ సే సమృద్ధి పేరుతో సహకార రంగంలో అన్ని సేవలను డిజిటలైజేషన్ చేస్తున్నాం యార్లగడ్డ.
- సహకార సంఘాల్లో పారదర్శకతకు జీఓ-90 అమలు అవసరం ఎమ్మెల్యే.







**గన్నవరం, పెన్ సత్తా, జులై 11:**గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకార రంగమే వెన్నెముక అని కృష్ణా జిల్లా కేంద్ర సహకార (కేడీసీసీ) బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. గన్నవరం మండలం బుద్దవరం గ్రామంలో శనివారం నూతనంగా ఆధునీకరించిన బుద్దవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ (పీఏసీఎస్) ను కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి పీఏసీఎస్ కార్యాలయం వరకు ఎడ్ల బండి పై ర్యాలీగా చేరుకుని రైతులు, ప్రజలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నూతన భవనాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ భవన నిర్మాణానికి స్థలం అందించిన దాత గూడవల్లి మల్లిఖార్జున వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకార వ్యవస్థ వెన్నెముక వంటిదని అన్నారు. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతులు, చేతివృత్తిదారులకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం "సహకార్ సే సమృద్ధి" నినాదంతో దేశవ్యాప్తంగా సహకార సంఘాలను కంప్యూటరీకరణ, డిజిటలైజేషన్ చేస్తోందని, రుణాల దరఖాస్తు నుంచి మంజూరు, ఆడిట్ వరకు అన్ని ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించేలా సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. కృష్ణా జిల్లాలో 425 సహకార సంఘాలు రైతులకు సేవలందిస్తున్నాయని, వ్యవసాయ రుణాలతో పాటు వ్యవసాయేతర రుణాలను కూడా అందించే దిశగా కేడీసీసీ బ్యాంకు పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం లోని సహకార సంఘాల అభివృద్ధిని ప్రత్యేకంగా చూడాలని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్‌ను బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే కోరినట్లు తెలిపారు. ఆ మేరకు బుద్దవరం పీఏసీఎస్ భవనం ఆధునీకరణతో పాటు కొత్తపల్లి సహకార సంఘం అభివృద్ధి, సూరంపల్లిలో కళ్యాణమండపం నిర్మాణం, కేసరపల్లి పీఏసీఎస్ పునరుద్ధరణ, అక్కడ మూతపడిన బ్యాంకు శాఖను తిరిగి ప్రారంభించేందుకు అంగీకరించినందుకు నెట్టెం రఘురామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని సహకార సంఘాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురై దాదాపు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయని, కేసరపల్లి పీఏసీఎస్ కూడా అలాంటి పరిస్థితినే ఎదుర్కొందన్నారు. ఆ సంఘాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు రూ.8 లక్షలు అవసరమని ఫోన్‌లో చెప్పగానే వెంటనే నిధులు మంజూరు చేసిన కేడీసీసీ చైర్మన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో 2 వేలకు పైగా సహకార సంఘాలు ఉండగా, కృష్ణా జిల్లాలో 425 సంఘాలు పనిచేస్తున్నాయని చెప్పారు. సహకార సంఘాల్లో పారదర్శక పాలన కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ-90ను వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఒకే గ్రామంలో 30--35 సంవత్సరాల పాటు ఒకే వ్యక్తి సెక్రటరీ గా కొనసాగడం వల్ల సహకార సంఘాల్లో అక్రమాలు, అవకతవకలకు అవకాశం ఏర్పడుతోందన్నారు. చదువు లేని పీఏసీఎస్ అధ్యక్షులు ఉన్న చోట్ల కార్యదర్శులదే పూర్తి పెత్తనం సాగుతోందని, ఆర్థిక సంస్థల్లో ఒకే చోట సుదీర్ఘకాలం పనిచేయడం మంచిది కాదన్నారు. జీఓ-90 అమలు పై పలుమార్లు సహకార శాఖ మంత్రిని కోరినా ఇప్పటికీ అమలు కాలేదని, ఇకనైనా కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురామ్ ఆప్కాబ్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి అమలుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. తాను కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ఉన్న సమయంలో తన నియోజకవర్గానికి ప్రత్యేకత ఇవ్వలేకపోయానని, తాను అడిగిన వెంటనే ప్రస్తుతం నెట్టెం రఘురామ్ ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా మంజూరు చేస్తుండడం సంతోషకరమన్నారు. గన్నవరం నియోజకవర్గం లోని పీఏసీఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సంఘాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను కేడీసీసీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.డి.ఏ సునీల్, గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసిమోహన్, ఏయంసి వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, బుద్ధవరం గ్రామ పి.ఏ.సి.ఎస్ చైర్ పర్సన్ ముద్రబోయిన శ్రీవాసరావు, డైరెక్టర్లు మన్నెం శ్రీనివాసరావు, గుర్రం రవి సత్యనారాయణ, కంభంపాటి లక్ష్మి, బొప్పూడి ప్రవీణ్, గొంది నరేంద్ర, అన్నే హరికృష్ణ, మేడేపల్లి రమ, బుస్సే సరిత, దేవినేని సులోచన, నెక్కంటి శ్రీదేవి, బడుగు బాలమ్మ, సబ్బినేని తనూజ, మల్లారెడ్డి కిషోర్, వేమూరి రవి, కానూరు యుగంధర్, ఆర్నేపల్లి వరలక్ష్మి, మేకా స్వాతి, కొల్లి లక్ష్మీ నారాయణ, అరికట్ల రవి, బుస్సే నాగ ప్రసాద్, చిమటా రవివర్మ, సవలం దినేష్, బోయపాటి మురళీకృష్ణ, మద్దినేని వెంకటేశ్వరరావు, అడుసుమిల్లి నవీన్, పాలడుగు నాని, గొంది శివ కోటేశ్వరరావు, గోగం బాల కోటయ్య, అట్లూరి నాని, మున్నంగి బాబురావు, బండి భాస్కర్, షేక్ కరీముల్లా, గార్లపాటి రాజేశ్వరరావు, పరుచూరి నరేష్, కాండ్రు అజయ్, సూరిబోయిన రాంబాబు, వేగే కృష్ణారావు, మొవ్వ వేణుగోపాల్, కనకవల్లి శేషగిరిరావు, నిమ్మకూరి మధు, మన్నెం శ్రీనివాసరావు మరియు స్థానిక రైతులు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, సహకార సంస్థల అధికారులు, పిఏసిఎస్ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# రోడ్డు విస్తరణ నిర్వాసితులకు కోర్టు ఆదేశాలు అమలు చేయాలి.




**మునగపాక, పెన్ సత్తా, జులై 11:**అనకాపల్లి నుండి అచ్చుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇల్లు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని కె. రాము, కోటేశ్వర రావు అధ్యక్షతన శనివారం మునగపాక లో సమావేశం నిర్వహించి, నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వర రావు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో నష్టపోతున్న నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉండాలి అని, కానీ నేటి ప్రభుత్వం పరిహారం కాకుండా టి డి ఆర్ బాండ్లు ఇస్తామని చెప్పడం అంటే నిర్వాసితులను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గజంకు 18,000 వేల నుండి 25,000 వేలు ఇస్తామని అందరి ఆమోదం తీసుకున్నారని, కూటమి ప్రభుత్వం దానిని అమలు చేయకుండా టిడిఆర్లు ఇస్తామని కొత్త ఆదేశాలు తీసుకొచ్చిందిని అన్నారు. దీని పై నిర్వాసితులు కోర్టుకు వెళ్లారని, కోర్టు ఆదేశాలు గ్రామీణ ప్రాంతంలో టిడిఆర్ బాండ్లు చెల్లవు అని నగదు పరిహారం ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చినా నేటికీ దానిని అమలు చేయకుండా నిర్వాసితులను అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తూ తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు కిరువైపులా పంట కాలువల ను ధ్వంసం చేసి రోడ్డు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిర్వాసితులను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే నష్టపోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇచ్చి రోడ్డు, వంతెన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అచ్చుతాపురం టు అనకాపల్లి నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్ రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రీ అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ, కాండ్రేగుల బాబురావు, ఆడారి శివ, ఎస్.కనుమునాయుడు, వేగి వెంకట అప్పారావు, తనకాల జగ్గారావు నిర్వాసితులు పాల్గొన్నారు.

# అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు.





**సింహాచలం, పెన్ సత్తా, జూలై 11:**
వరాహ లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్ర మైన సింహాచలంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు దినం కావడంతో పాటు సింహాద్రి అప్పన్న పై ఉన్న అపార భక్తి విశ్వాసాలతో ఆంధ్రప్రదేశ్ తో పాటు పలురాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు.
భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఏర్పాట్లను సమీక్షించారు. క్యూ లైన్లు, ప్రసాదాల పంపిణీ, ఆన్‌లైన్ దర్శన టికెట్ల నిర్వహణ, భక్తుల రాకపోకలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సూచనలు అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఈవో జల్లేపల్లి వెంకట్రావు మాట్లాడుతూ, సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా స్వామిని దర్శించుకోవడం దేవస్థానం ప్రధాన లక్ష్యం అని, అందుకు అనుగుణంగా అన్ని విభాగాల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాం అని తెలిపారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చల్లని మంచి నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్యంగా తాగునీటి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబుతో కలిసి ఈవో క్యూ లైన్లలో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్లను ప్రత్యక్షంగా పరిశీలించి భక్తులకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. అలాగే దేవస్థానం ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకులు ప్రతి కేంద్రంలో భక్తులకు మార్గదర్శనం చేస్తూ, క్యూలైన్లలో క్రమబద్ధంగా దర్శనం జరిగేలా సేవలందించారు. ఆలయ ప్రాంగణంలో భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతత కలిగేలా ఏర్పాట్లు చేశారు. దేవస్థానం చేపట్టిన సమర్థవంత మైన ఏర్పాట్లతో భక్తులందరూ ప్రశాంతంగా, సులభంగా స్వామివారిని దర్శించుకుని సింహాద్రి అప్పన్న అనుగ్రహాన్ని పొందారు.

# హెచ్పీవీ వ్యాక్సిన్ తోనే సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణ.





పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 11:** హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల మహిళల్లో వచ్చే సర్వయికల్ క్యాన్సర్ ను సెర్వావ్యాక్ వ్యాక్సిన్ వేయడం ద్వారానే నియంత్రించ గలమని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చీ చెప్పారు. నాట్కో ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా పోలీస్ బ్యారెక్స్ లోని టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 9 నుండి 14 ఏళ్ల లోపున్న ఆడపిల్లకు హెచ్పీవీ బూస్టర్ డోస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్, చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ ప్రారంభించారు. రెండు రోజులు పాటు ఈ శిబిరం జరుగుతుంది. మొత్తం 500 మంది పోలీసుల పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేస్తారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసులకు చెందిన ఆడపిల్లలకు క్యాన్సర్ వ్యాక్సిన్ వేసేందుకు ముందుకొచ్చిన సంస్థలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బూస్టర్ డోసు ద్వారా జ్వరం వచ్చినట్లయితే డాక్టర్ షిరీన్ రహమాన్ ను సంప్రదించాలని మొదటి డోసు వేయడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు రానందున ఈ విడత కూడా ఆడపిల్లకు ఏ సమస్య ఉండదని అన్నారు. ఈ డోస్ వేయడంతో ఆడపిల్లలు పెరిగి పెద్దయ్యాక కూడా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదని కమిషనర్ పేర్కొన్నారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ 9 నుండి 14 ఏళ్ల లోపున్న ఆడపిల్లలకు రెండు డోసులు ఆ పై వయసుగల వారైతే మూడు డోసులు వేయాలన్నారు. పోలీసులకు చెందిన మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు అక్టోబర్లో ఒక శిబిరం ఏర్పాటు చేయమని పోలీస్ కమిషనర్ను ఆమె కోరారు సర్వయికల్ క్యాన్సర్ బ్రెస్ట్ క్యాన్సర్ రెండు ప్రమాదకర మైనవి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ పాపారావు, ఏడీసీపీ అడ్మిన్ రామచంద్ర రావు, లయన్స్ క్లబ్ కార్యదర్శి బి. రవిచంద్ర, డాక్టర్ సత్యవేణి, చైతన్య స్రవంతి ఉపాధ్యక్షులు విజయ్ శేఖర్ తనయుడు అవినీస్, సీరం ఇనిస్టిట్యూట్ ఏరియా మేనేజర్ రాం రతన్, తదితరులు పాల్గొన్నారు.

# హరిపాలెంలో ప్రపంచ జనాభా దినోత్సవం.




**మునగపాక, పెన్ సత్తా, జూన్ 11:**ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని డాక్టర్ డి షకీనా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేసుకోవడం -- నేడు- భవిష్యత్తు కోసం అనే నినాదంతో దీనిని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ రోజున మానవ హక్కులు, లింగ సమానత్వం, కుటుంబ నియంత్రణ పై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి యువత తమ ఆరోగ్యం, విద్య, కుటుంబాల గురించి సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా వారిని శక్తివంతం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుందని, తద్వారా వారు ఒక న్యాయ మైన, ఆశాజనక మైన భవిష్యత్తును రూపొందించగలరని తెలిపారు. ఆరోగ్య బోధకులు రామలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య శాస్త్ర, సాంకేతిక రంగాలలో పురోగతి తల్లీబిడ్డల మరణాలను తగ్గించి, ఆయుర్దాయాన్ని పెంచింది. అయినప్పటికీ, విపరీతంగా పెరుగుతున్న జనాభా వాతావరణ మార్పులకు ఒక సవాలుగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఉమామహేష్ వైద్య సిబ్బంది గణేష్, ఇందిర, లక్ష్మి, రవికుమార్, నాగేశ్వర రావు, జగన్నాథ రావు, సూర్యనారాయణ, ఆదిలక్ష్మి, మరియారత్నం, ఆశా కార్యకర్తలు మంగమ్మ, శ్యామల పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీమన్నారాయణ పారాయణం



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 11**: గవరపాలెం అగ్రిమరి చెట్టు వద్ద కొలువైన సుభద్రా బలభద్ర సమేత జగన్నాథ్ స్వామి రథయాత్ర మహోత్సవం లో భాగంగా శనివారం ఆలయ మండపంలో కడిమిశెట్టి మాధురి నవీన్ ఆధ్వర్యంలో సామూహిక మహిళల శ్రీమన్నారాయణ సత్సంగం, శ్రీమన్నారాయణ పారాయణం ఘనంగా జరిగింది.
ఈ కార్యక్రమం ఆలయ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వహణ అధికారి కే చంద్ర తేజ, ఆలయ కమిటీ ధర్మకర్తలు బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భగతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వివి సుబ్రహ్మణ్యం, బోడ్డేడ వెంకట చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ఎస్పీ(అడ్మిన్)గా బాధ్యతలు స్వీకరించిన రోహిత్ కుమార్ చౌదరి.



**పల్నాడు, పెన్ సత్తా, జులై 11:** పల్నాడు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం, నరసరావుపేట నందు అదనపు నూతనంగా ఎస్పీ బాధ్యతలను స్వీకరించిన రోహిత్ కుమార్ చౌదరి.
అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల నిర్మూలన, శాంతి భద్రతల పరి రక్షణ, ప్రజలకు వేగంగా న్యాయం అందించే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. 2022 బ్యాచ్ కు చెందిన రోహిత్ కుమార్ చౌదరి గ్రేహౌండ్స్ నందు, తాడిపర్తి నందు అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ బదిలీ పై పల్నాడు జిల్లాకు రావడం జరిగింది.

## శెట్టిబలిజ భవనం నిర్మాణం కొరకు శంకుస్థాపన చేసిన వంశీకృష్ణ శ్రీనివాస్.

- ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే వంశీ.





**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 11**:34 వార్డు లో యాత, శెట్టిబలిజి సంక్షేమ సేవా సంఘం భవనానికి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. యాతవీధిలో 14 లక్షలతో ఈ భవనానికి స్థానిక ప్రజలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి మాటను నెరవేరుస్తూ దక్షిణ నియోజకవర్గ రూపురేఖలు మార్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అదే విధంగా ఎన్నో ఏళ్లగా శెట్టి బలిజి భవనం ఏర్పాటుకు ఎదురు చూస్తున్న స్థానిక ప్రజలు ఆకాంక్ష మేరకు ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. కేవలం రెండు నెలలు లోపే ఈ భవనాన్ని ఆధునీకరణంగా నిర్మించి అందుబాటులో తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, వార్డు అధ్యక్షులు, కూటమి నాయకులు, వీర మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## నూతన తారురోడ్డు ను ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్





**రాంబిల్లి, పెన్ సత్తా, జులై 11:** మండలం లోని అప్పారాయుడు పాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.1 కోటి (అంచనా విలువ) వ్యయంతో వేసిన నూతన తారురోడ్డు ను యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
అప్పారాయుడు పాలెం గ్రామంలో ఇప్పటికే రహదారులు, డ్రైనేజీ వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టామని, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత గ్రామాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని, అయినప్పటికీ ప్రజలకు అవసర మైన మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని అన్నారు.
యలమంచిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లే బాధ్యత తమదేనని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ వచ్చే మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ నిధులతో గ్రామం లోని ప్రతి ఇంటికీ స్వచ్ఛ మైన తాగునీరు అందించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. అలాగే గ్రామాల్లోని దేవాలయాలు, శివాలయాలు, పాఠశాలలు, ఇతర ప్రజా వసతుల అభివృద్ధికి కూడా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ ప్రజలు, కూటంమి నాయకులు, యువకులు తదిరులు పాల్గొన్నారు.



## ఖరీఫ్ సీజన్ సంబంధించి రైతులకు అందుబాటులో విత్తనాలు ఎరువులు.

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 11:** జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ సంబంధించి రైతులకు అందుబాటులో విత్తనాలు ఎరువులు పూర్తి స్థాయిలో ఉన్నాయని శనివారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఖరీఫ్--2026 సీజన్‌కు సంబంధించి ఏపీఎఐఎంఎస్ తో ఈ పంట డేటా అనుసంధానం చేయబడిందని, తేదీ 08-06-2026 నుండి నేటి వరకు ఏపీఎఐఎంఎస్ పోర్టల్ ద్వారా 1,784 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామన్నారు. మార్క్‌ఫెడ్ వద్ద యూరియా బఫర్ నిల్వ 4,012.92 మెట్రిక్ టన్నులు ఉందని, అదే విధంగా ప్రైవేట్ డీలర్లు, పిఎసిఎస్, ఆర్‌ఎస్కే ల వద్ద యూరియా నిల్వ : 3,185.12 మెట్రిక్ టన్నులు యూరియా నిల్వ ఉన్నట్లుగా, మొత్తం యూరియా 7,198.04 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. జూలై నెలకు యూరియా సరఫరా 4,615 మెట్రిక్ టన్నులుగా అధికారులు ప్రతిపాదించారన్నారు. ఖరీఫ్ సీజన్‌కు మొత్తంలో 19,658 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉండవచ్చని కలెక్టర్ అన్నారు. జిల్లా లోని అన్ని ఎరువుల రిటైల్ విక్రయ కేంద్రాలలో నిల్వలు మరియు గరిష్ట చిల్లర ధర (ఎంఆర్పి) ప్రకారం ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయో లేదో నిర్ధారించుటకు ఏడిఏ లచే డివిజన్ వారీగా తనిఖీలు నిరంతరం నిర్వహించ బడుతున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. యూరియా లభ్యత పై అన్ని ఏడిఏ లు, ఎంఏఓ లతో ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తూ, అవసరాన్ని బట్టి సంబంధిత ఆర్‌ఎస్కే లు, పిఎసిఎస్ లకు యూరియా నిల్వలు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలియజేశారు. తేదీ.04-07-2026న మాకవరపాలెం మండలం, జి. కోడూరు గ్రామంలోని వెంకటరమణ జనరల్ స్టోర్స్ యూరియాను అధిక ధరకు విక్రయించినందుకు "స్టాప్ సేల్ " ఆదేశాలు జారీ చేశామని, అదే విధంగా, సుమారు రూ.2.75 లక్షల విలువైన 46.485 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు స్వాధీనం అధికారులు చేసుకొన్నట్లు కలెక్టర్ తెలిపారు.
జిల్లాకు 21,000 క్వింటాళ్లు వరి విత్తనాలు కేటాయించినట్లు తెలిపారు. ఆర్‌ఎస్కే లలో 18,850 క్వింటాళ్లు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు 1,063 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. ఆర్‌ఎస్కే లలో అందుబాటులో 927.8 క్వింటాళ్లు పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు ఉన్నాయన్నారు. జిల్లాలో రైతులు అధైర్య పడవలసిన అవసరం లేదని ఖరీఫ్ సీజన్ కు అవసరమైన మొత్తం విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు అధికారులు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం







నక్కపల్లి పరిధి లోని 16 కిలో మీటర్ల మేర ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు.

**నక్కపల్లి, పెన్ సత్తా, జూలై 11:** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు రహదారి భద్రతను మెరుగు పరచడానికి, రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి నక్కపల్లి పోలీస్ లు ప్రత్యేక ముందస్తు చర్యలు చేపట్టారు.
నక్కపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ మురళి, ఎస్సై సన్నీబాబుల ప్రత్యక్ష ఆధ్వర్యంలో జాతీయ రహదారి పై భద్రతా పరికరాలను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేశారు. ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు 20 పెద్ద సైజు టైర్లు, 20 డ్రమ్ములను పోలీస్ సిబ్బంది సేకరించారు. వీటికి ఆకర్షణీయ మైన రంగులు వేసి, రాత్రి వేళల్లో మెరిసేలా ప్రత్యేక రేడియం రిఫ్లెక్టర్లను అమర్చారు. రాత్రి వేళల్లో స్పష్ట మైన విజిబిలిటీతో వాహన చోదకులకు, ముఖ్యంగా రాత్రి సమయాల్లో రహదారి మలుపులు, జంక్షన్లు స్పష్టంగా కనిపించేలా డ్రమ్ముల పై రిఫ్లెక్టివ్ రేడియం పెయింట్‌తో "గో స్లో" అని స్పష్టంగా రాయించారు. నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి దాదాపు 16 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ 16 కి.మీ. పరిధి లోని అన్ని ప్రధాన జంక్షన్లు, మలుపులు, తరచూ ప్రమాదాలు జరిగే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఈ రక్షణ పరికరాలను అమర్చారు. ఈ సందర్భంగా నక్కపల్లి పోలీస్ అధికారులు మాట్లాడుతూ జాతీయ రహదారి పై ప్రయాణించే వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన రేడియం సూచికలను గమనిస్తూ, సురక్షిత ప్రయాణం చేయడం ద్వారా ప్రమాదాల నివారణకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# చంద్రబాబు కేబినెట్ మీటింగులు ప్రజా సంక్షేమం కోసం కాదు.. అమర్

- **బినామీల భూ పందేరం కోసమే మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ధ్వజం.**
- **విశాఖలో భారతదేశ చరిత్రలోనే బిగ్గెస్ట్ ల్యాండ్ స్కామ్.**
- **అమరావతిలో రియల్ ఎస్టేట్ స్కామ్.**
- **విశాఖలో రూ. 30 వేల కోట్ల మహా భూ దోపిడీ.**
- **కూటమి ప్రభుత్వం పై మాజీ మంత్రి అమర్నాథ్ ధ్వజం.**
- **ఎండాడలో రూ. 600 కోట్ల భూ కుంభకోణం.**
- **మధురవాడలో రూ.2000 కోట్ల భూముల పై బాబు బినామీల కన్ను.**
- **విశాఖ భూములు మీ తాత సంపాదా లోకేష్?.**
- **సూటిగా నిలదీసిన మాజీ మంత్రి అమర్నాథ్.**
- **99 పైసలు, రూపాయికే వేల కోట్ల ఖరీదైన భూములు సంతర్పణ.**
- **లక్షలాది ఉద్యోగాలొస్తాయని భారీ ప్రచారం.**
- **కూటమి మాజీ మంత్రి పై విచారణ జరపాలి!.**
- **కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన అమర్నాథ్.**



**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 11:**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగే కేబినెట్ సమావేశాలు ప్రజా సక్షేమం కోసం కాకుండా, కేవలం తమ బినామీలకు ప్రభుత్వ భూములను కట్టబెట్టడానికే పరిమితమయ్యాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ విశాఖపట్నాన్ని దేశం లోనే ప్రముఖ నగరంగా తీర్చిదిద్ది భవిష్యత్తుగా మారిస్తే... కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుండి ఈ నగరం పై కళ్ళు పడ్డాయని మండి పడ్డారు. గడిచిన రెండేళ్లలో విశాఖలో రూ. 25 వేల కోట్ల నుండి రూ. 30 వేల కోట్ల మేర మహా భూ కుంభకోణం జరిగిందని, ఇది దేశం లోనే వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ ల్యాండ్ స్కామ్ అని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, ఈ భూ దోపిడీని ప్రశ్నిస్తున్న వారి పై అక్రమ కేసులు పెడుతూ, సోషల్ మీడియా నియంత్రణ పేరుతో టాస్క్ ఫోర్స్ అంటూ కొత్త డ్రామాలకు తెరలేపారని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వానికి, నాయకులకు రాష్ట్రం పై బాధ్యత లేదు..

ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రతినెలా మంత్రి మండలి సమావేశాలు జరగడం సహజం. ఆ సమావేశం జరిగిన ప్రతిసారి పేదలకు మేలు చేసే ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు?, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు దిశగా ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా? అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తుంటారు. కానీ చంద్రబాబు సీఎం అయిన తర్వాత ప్రతి కేబినెట్ సమావేశంలోనూ 30-40 అజెండా అంశాలుంటే, అందులో దాదాపు 30 కు పైగా అంశాలు వారికి కావాల్సిన వ్యక్తులకు భూ కేటాయింపుల కోసమే ఉంటున్నాయి. నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో 35 అంశాలు ఉంటే అందులో 25 కు పైగా అంశాలు భూ కేటాయింపుల కోసమే ఆమోదించారు. తొలిసారిగా ఒక కేబినెట్ మీటింగ్‌లో 5 గురు మంత్రులు హాజరు కాకపోవడం చూస్తున్నాం. దీన్ని బట్టే కేబినెట్ సమావేశాల మీద వీరికి ఏ రకమైన ఉద్దేశం ఉందో, రాష్ట్రం మీద ఎంత బాధ్యత ఉందో అర్థం అవుతుందని ఏద్దేవా చేశారు.

రూ. 30 వేల కోట్ల మహా భూ స్కామ్..

ఒక పక్క అమరావతిలో రియల్ ఎస్టేట్ స్కామ్, ఇక్కడ విశాఖపట్నంలో భూముల దోపిడి జరుగుతోంది. అమరావతి అనేది భారతదేశ చరిత్రలో ఒక బిగ్గెస్ట్ రియల్ ఎస్టేట్ స్కామ్ అయితే, విశాఖపట్నంలో గడిచిన రెండున్నర సంవత్సరాలుగా చంద్రబాబు నాయుడు చేసిన భూముల కేటాయింపు అంతకంటే బిగ్గెస్ట్ ల్యాండ్ స్కామ్ అని ఆరోపణలు చేశారు. గీతం భూముల దగ్గర నుంచి ఉర్సా లాంటి ఊరు పేరు లేనటువంటి కంపెనీలకు, సత్వా లాంటి రియల్ ఎస్టేట్ కంపెనీలకు, కపిల్ లాంటి గ్రూపులకు తనకు కావాల్సిన బినామీలకి కేవలం 99 పైసలకే భూములు కేటాయించారని ఆరోపించారు. ఈ రకంగా గడిచిన రెండేళ్లలో భూ కేటాయింపుల ద్వారా దాదాపు పాతిక వేల నుంచి, 30 వేల కోట్ల రూపాయలు చేతులు మారాయన్నారు.

మధురవాడలో రూ. 2000 కోట్ల విలువైన భూమి బదలాయింపు..

నిన్న కేబినెట్‌లో 22-ఏ లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) కి బదలాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మధురవాడలో ఉన్న ఈ 9.39 ఎకరాల భూమి మార్కెట్ విలువ రూ. 1,500 కోట్ల నుండి రూ. 2,000 కోట్లు ఉంటుంది. ఎకరం కనీసం రూ. 100 కోట్ల పైమాటే. దీని అఫీషియల్ సబ్ రిజిస్టర్ వాల్యూ రూ. 190 కోట్లుగా బుక్స్ మీద చూపించి రెవెన్యూ నుంచి టూరిజం డిపార్ట్ మెంట్‌కు మార్చారు. ఇదంతా మొదటి ప్రక్రియ మాత్రమే. రేపు ఈ భూమిని చంద్రబాబు నాయుడు తనకు ఎన్నికల్లో సాయం చేసిన వారికో, బినామీలకో హోటల్ అనో, కన్వెన్షన్ సెంటర్ అనో చెప్పి కట్టబెట్టే కార్యక్రమం చేస్తారు.

ఇదేమన్నా లోకేష్ తాత సంపాదించిన ఆస్తా? ధైర్యముంటే శ్వేతపత్రం ఇవ్వండి.

కారు చౌకగా వేల కోట్ల రూపాయల భూముల్ని రూపాయికి, 99 పైసలకి కట్టబెడుతుంటే... అవసర మైతే మొత్తం రూపాయికే ఇస్తాం, నీకేం ప్రాబ్లం అని ముఖ్యమంత్రి కొడుకు అడుగుతున్నాడు. వైయస్సార్సీపీ తరపున సూటిగా ప్రశ్నిస్తున్నాం.. విశాఖపట్నం భూములు ఏమైనా మీ తాత సంపాదించిన ఆస్తా?, రెండున్నర సంవత్సరాలలో దాదాపు లక్ష మందికి ఉపాధి కలుగుతుందని ఎస్ఐపీబీ మీటింగుల ద్వారా, మీ గెజిట్ పత్రికల ద్వారా సమాచారం ఇచ్చారు. మరి ఇంతవరకు ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో ప్రభుత్వం దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు.

బూడిద మిగుల్చుతున్న బూడిద పార్టీ...

భూములేమో మీ బినామీలు సొంతం చేసుకుంటున్నారు, తీరా విశాఖపట్నానికి మిగిలింది బూడిద మాత్రమే. చంద్రబాబు చెప్తున్న 'సంపద సృష్టి' అంటే రాష్ట్రం కోసం కాదు, ఆయన బినామీల కోసం అని ప్రజలకు అర్థమైపోయిందన్నారు. విశాఖపట్నంలో మీ కుమారుడు తోడల్లుడు, ఎంపీ భరత్ ఏకంగా రూ. 5,000 కోట్ల విలువైన 55 ఎకరాల ప్రభుత్వ భూమిని దోచుకున్నారు. వైయస్సార్సీపీ ప్రశ్నిస్తే ఆ భూమి విలువ రూ. 1,200 కోట్లే అని సమర్ధించుకుంటున్నారు. ప్రభుత్వ భూమి కనీసం సెంట్ కూడా ముట్టు కోకూడదనే కనీస జ్ఞానం ప్రజా ప్రతినిధులకు లేదా? అని ప్రశ్నించారు.

రూ.600 కోట్ల ఎండాడ భూ కుంభకోణం పై విచారణ జరగాలి అని అమర్ డిమాండ్ చేశారు. ఎండాడలో దాదాపు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక మాజీ మంత్రి ప్రైవేట్ భూమిగా బదలాయింపు చేశాడని, దాని విలువ రూ. 600 నుండి రూ. 700 కోట్లు అని పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీని పై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎందుకు మాట్లాడటం లేదు? జిల్లాలో చాలా మంది మాజీ మంత్రులం ఉన్నాం. ప్రజల్లో ఉన్న అనుమానాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ మీద ఉంది. ఇంత పెద్ద ఇష్యూ జరిగితే డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఎందుకు రిజాయిండర్ ఇవ్వరు?, గతంలో 2014-19 మధ్యలో కూడా టిడిపి హయాంలో రెవెన్యూ రికార్డుల టాంపరింగ్ జరిగితే.. హుద్‌హుద్ తుఫాన్ వచ్చి ఫైల్స్ కొట్టుకుపోయాయని చెప్పారు. రేపు ఈ స్కామ్‌ల పై ప్రశ్నిస్తే ఎలుకలు కొరికేశాయనో, చంద్రబాబు పట్టుకుపోయారనో చెప్తారా?, భీమిలి గీతం ల్యాండ్ స్కామ్, ఎండాడ భూ కుంభకోణం పై తక్షణమే విచారణ జరగాలన్నారు. సూసైడ్ చేసుకునే వరకు వదలని సైకో సోషల్ మీడియా మీది..

కేబినెట్‌లో ప్రజా సమస్యలు, ఎన్నికల్లో మీరిచ్చిన హామీలు మహిళలకు రూ. 1,500, నిరుద్యోగులకు రూ. 3,000 నిరుద్యోగ భృతి, కొత్త పెన్షన్ల వంటి వాటి మీద చర్చలు లేవు. కేవలం సోషల్ మీడియాని ఎలా అరికట్టాలనే దాని పై డీజీపీతో ప్రెజెంటేషన్ ఇప్పించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు ఉదయం లేస్తే ఈనాడు, ఆంధ్రజ్యోతి చదవాలి, ఏబీఎన్, టీవీ 5, ఈటీవీ మాత్రమే చూడాలి... అవి చెప్పిందే నిజమని నమ్మాలనేది చంద్రబాబు విధానం. దాన్ని ప్రశ్నించే సామాన్యుడు సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే కేసులు పెడుతున్నారు. ఒకవేళ రాష్ట్రంలో సోషల్ మీడియా నియంత్రణకు టాస్క్ ఫోర్స్ పెడితే, అది మొదట తెలుగుదేశం పార్టీ నడుపుతున్న సైకో సోషల్ మీడియా విభాగానికే వర్తిస్తుంది. మీ సోషల్ మీడియా కర్కశత్వానికి సాక్ష్యాలివిగో...

వైయస్సార్సీపీ సోషల్ మీడియా కేవలం రాజకీయంగానే ప్రశ్నిస్తుంది తప్ప ఎన్నడూ మహిళల జోలికి పోలేదు. కానీ టిడిపి సోషల్ మీడియా మా ఇంట్లో మహిళలను, వైయస్. జగన్ భార్య, తల్లి, చెల్లిని టార్గెట్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. బెండపూడి హైస్కూల్లో ఇంగ్లీష్ మీడియం చదివి ప్రతిభ చాటిన 14 ఏళ్ల చిన్న పాప మేఘన పై సోషల్ మీడియా దాడి చేశారు. సొంత ఇల్లు లేని పేద కుటుంబానికి చెందిన గీతాంజలి అనే అమ్మాయికి జగన్ ఇళ్ల పట్టా ఇస్తే, ఆ సంతోషంలో మాట్లాడినందుకు ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుని చనిపోయేంత వరకు వేధించిన హిస్టరీ చంద్రబాబు వెనక ఉన్న సోషల్ మీడియాది. సుగాలి ప్రీతి తల్లి న్యాయం కోసం రోడ్డు ఎక్కితే దివ్యాంగురాలైన ఆ తల్లిని వేధిస్తున్నారు. తులసి చందు అనే సోషల్ మీడియా ఇన్ఫ్లుయన్సర్ పై హేయంగా దాడులు చేస్తున్నారు. మీ అవినీతిని, భూదోపిడీని కప్పిపుచ్చు కోవడానికే ఈ టాస్క్ ఫోర్స్ డ్రామాలు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర సంపదను చంద్రబాబు నాయుడు తన బినామీలకు దోచిపెడుతుంటే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ హెచ్చరించారు. ఈ భూపందేరం పై, వైఫల్యాల పై ప్రజల నుంచి వస్తున్న తిరుగుబాటును తట్టుకోలేకనే ప్రభుత్వం సోషల్ మీడియా పై అక్రమ బనాయింపుల డ్రామా ఆడుతోందని మండి పడ్డారు. భీమిలి గీతం ల్యాండ్ స్కామ్, ఎండాడ రూ. 600 కోట్ల భూ కుంభకోణం పై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టి డైవర్ట్ చేయాలని చూసినా, ప్రశ్నించే ప్రతి పౌరుడికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందని, మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

# చిరంజీవి మిత్రుని కుమార్తె భవిష్యత్తుకు చేయూత

- **రూ.1.50 లక్షల డిపాజిట్**
- **1996 - 97 ....10వ తరగతి ఎస్పీసీఎస్ రైల్వే స్కూల్ బ్యాచ్ విద్యార్థుల సహాయం**



**ధర్మవరం, జులై 11 (పెన్ సత్తా)**స్నేహానికి నిలువెత్తు నిదర్శనంగా 1996--97 పదో తరగతి బ్యాచ్ మిత్రులు తమ తోటి మిత్రుడు చిరంజీవి కుటుంబానికి అండగా నిలిచారు.డయాలసిస్ చికిత్స పొందుతున్న చిరంజీవి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని,ఆయన కుమార్తె హనీ దీక్షిత భవిష్యత్తు ఉన్నత చదువులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముందుచూపుతో రూ.1.50 లక్షలను కెనరా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా జమ చేశారు.

ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, చిరంజీవి ఆరోగ్య పరిస్థితి కారణంగా కుటుంబంపై ఆర్థిక భారం పడిందని, అలాంటి సమయంలో ఆయన కుమార్తె విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఈ సహాయం అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ హెడ్మాస్టర్ వెంకటప్ప మాట్లాడుతూ,హనీ దీక్షిత ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ సహాయ కార్యక్రమాన్ని మిత్రులు అభినందిస్తూ, నిజమైన స్నేహం అంటే కష్టకాలంలో అండగా నిలవడమేనని రిటైర్డ్ హెడ్మాస్టర్ వెంకటప్ప ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో చేనేత ప్రముఖులు,టిడిపి యువ నాయకులు సంధా రాఘవ, జింకాపురుషోత్తం, లోకనాథ్,జయ రాములు,హరి, పరంధామ,నాగవేణి, గోవిందమ్మ,గాయత్రి, ఫక్రునిస తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకల పై అవగాహన

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ తిప్పేంద్ర నాయక్



**ధర్మవరం, పెన్ సత్తా, జులై 11:**ప్రపంచ జనాభా దినోత్సవం వేడుకల పై పట్టణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో యువత తక్కువగా ఉండడం కారణంగా కాన్పు కాన్పుకు మధ్య ఎడమ ఆరోగ్యకర మైన, ఆనందకర మైన కుటుంబానికి ఆధారం అని ప్రజలలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కుటుంబ నియంత్రణ, మాతా శిశు ఆరోగ్యం, మహిళల సాధికారత, బాలికల విద్య, బాధ్యతాయుత మైన తల్లిదండ్రుల దృఢత్వం, ఆరోగ్యవంత మైన సమాజ నిర్మాణం పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ పుష్పలత, డాక్టర్ సురేష్ నాయక్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ శ్వేత, డాక్టర్ జయంత్, డాక్టర్ లక్ష్మీ లత, ఏఎన్ఎంఎస్, ఆశా కార్యకర్తలు, మలేరియా ఎస్ యు ఓ.జయరాం నాయక్, మలేరియా అసిస్టెంట్లు, జీవోలు, ఎం ఓ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన ఏపీ పిటీడీ ఎంప్లాయిస్ యూనియన్ 75 వ వజ్రత్సవ వేడుకలు.

రాష్ట్ర నాయకులు నాగార్జున రెడ్డ



**ధర్మవరం, పెన్ సత్తా, జులై 11:**పట్టణం లోని ఆర్టీసీ డిపో ఆవరణములో ఏపీ పిటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు..ఈ కార్యక్రమానికి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగార్జున రెడ్డి ముఖ్య అతిథిగా వ్యవహరించి 75 సంవత్సరాల ఎంప్లాయిస్ యూనియన్ గొప్ప తనాన్ని, సాధించిన విజయాలను గూర్చి వివరంగా తెలియజేసారు. ఈ సందర్బంగా యూనియన్ పతాకాన్ని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఈశ్వరయ్య ఎగురవేశారు. ఈ సందర్బంగా వజ్రోత్సవ కేక్ ను డిపో లోని మహిళా ఉద్యోగులచె కటింగ్ చేయించారు. అనంతరం నాగార్జున రెడ్డి,ఈశ్వరయ్య మాట్లాడుతూ,

75 సంవత్సరాల లో ఎంప్లాయిస్ యూనియన్ సాధించిన విజయాలను వివరించారు.వీక్లీ ఆఫ్ పద్ధతి నుండి వారానికి ఒక ఆఫ్ సాధించడం జరిగిందని,ఆర్టీసీ ఉద్యోగులను వడ్డీ వ్యాపారం నుండి కాపాడే ఉద్దేశంతో సిసిఎస్ సంస్థలు ప్రారంభించడం జరిగిందన్నారు.ట్రేడ్ విన్నర్ స్కీములు పునరుద్ధించడం జరిగిందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిందని తెలిపారు.ఈ కార్యక్రమం లో రీజినల్ నాయకులు నరసింహులు,డిపో అధ్యక్ష, కార్యదర్శులు తిరుమలేష్, ముస్తఫా, గ్యారేజి కార్యదర్శి మల్లికార్జున, సిస్టం సూపెర్వైజర్, సుధాకర్ అత్యధిక సంఖ్యలో ఉద్యోగ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## పూర్తి అయిన ఉపాధ్యాయుల సర్దుబాటు కార్యక్రమం

ఎంఈఓ గోపాల్ నాయక్




**ధర్మవరం, జులై 11 (పెన్ సత్తా )**ధర్మవరం డివిజన్లో ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తి చేయడం జరిగింది అని ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు లేని చోట పాఠశాల నుండి విద్యార్థులు ఉన్న పాఠశాలలకు పాత డివిజన్ స్థాయిలో దాదాపు 18 మండలాల నుండి 29 మంది ఉపాధ్యాయులను డివిజనల్ స్థాయిలో సర్దుబాటు చేయడం జరిగింది అని తెలిపారు.ఈ సర్దుబాటు కార్యక్రమం శ్రీ సత్య సాయి జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో 3మెన్ కమిటీ ద్వారా ఎంఈఓ గోపాల్ నాయక్ ధర్మవరం ఎంఈఓ జయచంద్ర కొత్తచెరువు, సాయినాథ్ సీనియర్ అసిస్టెంట్,చంద్ర శేఖర్ మొదలగు వారు పూర్తి చేయడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి,ముత్యాల ప్ప రామకృష్ణ నాయ క్ వివిధ మండల నుండి వచ్చిన ఉపాధ్యాయులు మొదలగు వారు పాల్గొన్నారు.

## క్రీడలే వారధి.. భారత్-న్యూజిలాండ్ మధ్య

# శతాబ్దపు క్రీడా సంబంధాలు

భారత్‌లో 2030 కామన్వెల్త్ గేమ్స్, ఆస్ట్రేలియాలో 2032 ఒలింపిక్స్ నేపథ్యంలో సహకారం

భారత్, న్యూజిలాండ్ మధ్య క్రీడలు ఒక శక్తిమంతమైన వారధిగా పనిచేస్తున్నాయని, ఇరు దేశాల ప్రజలను బలంగా కలుపుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో కలిసి ఆక్లాండ్‌లో జరిగిన 'స్పోర్టింగ్ షోకేస్' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పర్యటన ద్వారా మోదీ తన క్రీడా దౌత్యానికి మరింత పదును పెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. "భారత్, న్యూజిలాండ్ మధ్య క్రీడలు ఎల్లప్పుడూ బలమైన వారధిగా నిలిచాయి. ఈ ఏడాదితో మన మధ్య క్రీడా సంబంధాలు ఏర్పడి ఒక శతాబ్దం పూర్తవుతోంది. ఆక్లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో కలిసి నేను పాల్గొన్న స్పోర్టింగ్ షోకేస్‌లో అత్యాధునిక క్రీడా ఆవిష్కరణలను చూశాను. టెక్నాలజీ, సృజనాత్మకత క్రీడల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుతున్నాయో, మన రెండు దేశాలను మరింత దగ్గరికి ఎలా చేరుస్తున్నాయో చూడటం అద్భుతంగా ఉంది" అని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడా భాగస్వామ్యాలను బలోపేతం చేయాలనే తన విస్తృత ప్రయత్నాల్లో భాగంగానే ప్రధాని మోదీ ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కొన్ని రోజుల క్రితమే ఆయన ఆస్ట్రేలియా పర్యటనలోనూ ఇదే తరహాలో క్రీడా సంబంధాలపై దృష్టి సారించారు. మెల్‌బోర్న్‌లోని చారిత్రక క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగిన భారత్-ఆస్ట్రేలియా క్రీడా సంబంధాల వేడుకలో మోదీ పాల్గొన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, విక్టోరియా ప్రీమియర్ జెసింటా అలన్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అక్కడ క్రికెట్, కబడ్డీ,




ఆస్ట్రేలియన్ రూల్స్ ఫుట్‌బాల్ ఆడుతున్న యువ క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి ఆస్ట్రేలియా క్రీడా దిగ్గజాలైన స్టీవ్ వా, లీసా స్థలేకర్ వంటి వారు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ కలిసి 'భారత్-ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్'ను ప్రారంభించారు. ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో క్రీడలు, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలు కీలక స్తంభాలని ఈ రోడ్‌మ్యాప్ నొక్కి చెబుతోంది. భవిష్యత్ దశాబ్దంలో క్రీడా రంగంలో సహకారానికి అపారమైన అవకాశాలున్నాయని మోదీ అన్నారు. భారత్ 2030లో కామన్వెల్త్ క్రీడలకు, ఆస్ట్రేలియా 2032లో బ్రిస్బేన్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో క్రీడలు, సంబంధిత పరిశ్రమలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడానికి ఇది ఒక సహజమైన అవకాశమని ఆయన వివరించారు. ఇదే సమయంలో ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టుకు మోదీ అభినందనలు తెలిపారు. క్రీడా నైపుణ్యం, యువత భాగస్వామ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి రంగాల్లో కలిసి పనిచేయడానికి గొప్ప అవకాశాలున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# రామ మందిర నిర్మాణ పనులన్నీ జులై 30నాటికి పూర్తవుతాయి

అయోధ్యలోని రామ మందిర ప్రధాన నిర్మాణ పనులు జులై 30 నాటికి పూర్తి కానున్నాయి. ఆలయ నిర్మాణం తుది దశకు చేరుకుందని ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్, ప్రధాని మోదీ మాజీ ముఖ్యకార్యదర్శి నృపేంద్ర మిశ్రా వెల్లడించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు తెలిపారు.

ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న స్మారక నిర్మాణాల్లో ఎక్కువ భాగం పూర్తయ్యాయని నృపేంద్ర మిశ్రా చెప్పారు. నిరంతరం వెలిగే అఖండ జ్యోతి ఏర్పాటుకు సంబంధించిన పని మాత్రమే మిగిలి ఉందని, మిగతా నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. మరో స్మారక నిర్మాణం కూడా జులై చివరి నాటికి పూర్తవుతుందని, దీంతో ఆలయ ప్రధాన నిర్మాణ కార్యక్రమాలు పూర్తిగా ముగుస్తాయని పేర్కొన్నారు. ప్రధాన ఆలయ నిర్మాణం పూర్తయినప్పటికీ ఆలయ సముదాయానికి వెలుపల చేపడుతున్న కొన్ని మౌలిక వసతుల పనులు మరికొంత కాలం కొనసాగనున్నాయని మిశ్రా తెలిపారు. సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవైన ప్రహరీ గోడ నిర్మాణాన్ని సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అలాగే ఆలయ సముదాయానికి బయట నిర్మిస్తున్న ఆడిటోరియం పనులు నవంబర్ లేదా డిసెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించారు.

**20 గ్యాలరీలతో రామ్ కథా సంగ్రహాలయం**

భక్తులకు శ్రీరాముడి చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఆధునిక సాంకేతికతతో పరిచయం చేసేలా రూపొందిస్తున్న 'రామ్ కథా సంగ్రహాలయ్' పనులపై కూడా మిశ్రా వివరాలు వెల్లడించారు. ఈ మ్యూజియంలో ఏర్పాటు



చేయనున్న 20 గ్యాలరీలకు సంబంధించిన కథా రూపకల్పన పూర్తయిందని చెప్పారు. గ్యాలరీల్లో వినియోగించనున్న సాంకేతికత, వీడియో ప్రదర్శనలపై తుది నిర్ణయాలు తీసుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**'నిర్వహణ బాధ్యతలు నా పరిధిలో లేవు'**

ఆలయానికి రోజూ భారీ సంఖ్యలో తరలివస్తున్న భక్తుల నిర్వహణ, రద్దీ నియంత్రణ వంటి అంశాలపై అడిగిన ప్రశ్నకు నృపేంద్ర మిశ్రా ఈ విధంగా స్పందించారు. ఆలయ నిర్వహణ వ్యవస్థను తాను పరిశీలించలేదని, ఆ బాధ్యత తన పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. ప్రధాన ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత మిగిలిన అనుబంధ ప్రాజెక్టులు కూడా దశలవారీగా పూర్తికానుండటంతో, అయోధ్య రామమందిర సముదాయం మరింత సమగ్ర రూపాన్ని సంతరించుకోనుంది. ఇప్పటికే దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు అయోధ్యకు చేరుకుంటుండగా, పూర్తి స్థాయి అభివృద్ధి అనంతరం భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

**విరాళాల చోరీపై స్పందన**

రామమందిర విరాళాల చోరీ కేసుపై కూడా మిశ్రా స్పందించారు. దీనిని నేను పూర్తిగా కానుకల చోరీకి సంబంధించిన ఘటనగానే భావిస్తున్నా. ఇది మాకు ఒక మచ్చ అని మా కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ గిరి పేర్కొన్నారు. ఒక రకంగా చెప్పాలంటే, ఇది తీవ్రమైన అవమానకరమైన విషయం. రామమందిరంలో ఇలాంటి ఘటన జరగడం మనందరికీ సిగ్గుచేటు. ఇది పరిపాలనాపరమైన ఏర్పాట్లకు సంబంధించిన సమస్య. వ్యవస్థను మెరుగుపరుస్తామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని నృపేంద్ర మిశ్రా పేర్కొన్నారు. ఇక అయోధ్య విరాళాల చోరీపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ నెల 13న విచారణ చేపట్టనుంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ వ్యాజ్యం వెళ్లనుంది. మొత్తం రూ.2-3 కోట్లు చోరీ చేసినట్లు సిట్ గుర్తించింది. రామాలయ విరాళాల కౌంటింగ్ కేంద్రాల నుంచి రూ.500 నోట్లతో మొదలుపెట్టి రెండు మూడు నెలల్లోనే ఈ భారీ మొత్తాన్ని దొంగతనం చేసినట్లు తెలిపారు.

# న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్లకుకోర్టు నోటీసులు

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ కొత్త విమానం గురించి వార్త రాసినందుకు అమెరికా వార్తా పత్రిక న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్‌లకు కోర్టు నోటీసులు జారీ అయ్యాయి. ఖతర్ బహుమతిగా ఇచ్చిన విమానాన్ని డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడి అధికారిక విమానంగా మార్చిన సంగతి, వారం రోజుల క్రితమే ఇది అందుబాటులోకి వచ్చిన విషయమూ తెలిసిందే. అయితే ఈ కొత్త విమానంలో భద్రతా వ్యవస్థలను ప్రశ్నిస్తూ న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్లు వార్తలు ప్రచురించారు. దీనిపై శుక్రవారం తమ రిపోర్టర్లు జూలియన్ ఈ. బార్న్స్, ఎరిక్ లిప్టన్, టైలర్ పేజర్, ఎరిక్ ష్మిట్లకు నోటీసులు జారీ అయినట్లు న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. రానున్న బుధవారం మాన్‌హాటన్‌లోని ఫెడరల్ గ్రాండ్ జ్యూరీ ముందు సాక్ష్యం ఇవ్వాలన్నది ఈ నోటీసుల సారాంశం. ఫెడరల్ ఏజెంట్లు కొంతమంది జర్నలిస్టుల ఇళ్లకు వెళ్లి మరీ నోటీసులు జారీ చేయడం గమనార్హం.

**ఇదీ నేపథ్యం...**

డొనాల్డ్ ట్రంప్ గత వారం కొత్త ఎయిర్ ఎయిర్ ఫోర్స్‌వన్‌లో టర్కీలో జరిగిన నాటో సదస్సుకు వెళ్లారు. అయితే బుధవారం మాత్రం పాత ఎయిర్ ఫోర్స్--వన్‌లో ఇంగ్లాండ్‌లోని మిల్డెన్ హాల్లో ఉన్న రాయల్ ఎయిర్‌ఫోర్స్ కేంద్రానికి వెళ్లారు. ఆసక్తికరంగా కొత్త విమానమూ అక్కడకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ట్రంప్ కొత్త విమానంలో తిరిగి వచ్చారు. అమెరికా -- ఇరాన్‌ల మధ్య కాల్పుల ఒప్పందం విఫలమైన సందర్భంలోనే విమానాల మార్పు జరిగింది. అమెరికా ఇరాన్‌పై



దాడులు చేయగా ఇరాన్ మూడు గల్ఫ్ అరబ్ దేశాలపై క్షిపణలు ప్రయోగించింది. ఈ నేపథ్యంలో 40 కోట్ల డాలర్ల ఖర్చుతో మార్పులుచేర్పులు చేసిన కొత్త ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ఆధునిక భద్రత వ్యవస్థలు లేవేమో అన్న అనుమానం తో న్యూయార్క్ టైమ్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. భద్రతా దళాల సూచనల మేరకు అధ్యక్షుడు పాత విమానంలో వెళ్లారని తెలిపింది. అయితే ట్రంప్ వాటిని ఖండించారు. సైనికులకు కొత్త ఎయిర్‌ఫోర్స్‌వన్‌ను చూపేందుకే మిల్డెన్‌హాల్‌లో ఆగినట్లు సోషల్ మీడియాలో తెలిపారు. వైట్ హౌస్ కొత్త విమానంలో భద్రతా లోపాలు లేవని స్పష్టం చేసింది. న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్లకు నోటీసులు జారీ చేసిన విషయంపై శనివారం వరకూ వైట్‌హౌస్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

## ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన సాంకేతికతలు యుద్ధ స్వరూపాన్ని మారుస్తున్నప్పటికీ, అంతిమంగా విజయాన్ని నిర్ణయించేది సంప్రదాయ సైనిక సామర్థ్యాలు, శిక్షణ పొందిన సైనికులు, దేశ సంకల్పమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. నేడు విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' యుద్ధనౌకను నౌకాదళంలోకి ప్రవేశపెట్టిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవిష్యత్ యుద్ధాలు ఏఐతో జరగవచ్చేమో గానీ, వాటిని గెలిచేది మాత్రం మన సైనికులు, విశ్వసనీయ సైనిక బలంతోనేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "నూతన సాంకేతికతలు యుద్ధ స్వభావాన్ని మార్చిన మాట వాస్తవమే. కానీ, సంప్రదాయ యుద్ధ సామర్థ్యాల ప్రాధాన్యతను అవి ఏమాత్రం తగ్గించలేదు. యుద్ధం ప్రాథమిక సూత్రాలను నెరవేర్చడానికి బలమైన సంప్రదాయ సామర్థ్యాలు నేటికీ ఎంతో అవసరం. కేవలం కొత్త టెక్నాలజీపై ఆకర్షణతో సంప్రదాయ సైనిక శక్తిని నిర్లక్ష్యం చేసిన దేశాలు భారీ మూల్యం చెల్లించుకున్నాయని చరిత్ర మనకు గుర్తుచేస్తోంది" అని వివరించారు. నూతన టెక్నాలజీ, సంప్రదాయ వేదికలు ఒకదానికొకటి పోటీ కాదని, అవి పరస్పర పూరకాలు అని రక్షణ మంత్రి తెలిపారు. "ఒక సంప్రదాయ వేదిక కొత్త టెక్నాలజీ లేకుండా బలహీనపడుతుంది, అదే సమయంలో టెక్నాలజీకి ఒక వేదిక అవసరం. అందుకే, రెండు రంగాల్లోనూ రాణిస్తూ, వాటి మధ్య సమతుల్యం పాటించాలనేది భారత విధానం. భవిష్యత్ సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతూనే, మన సంప్రదాయ సామర్థ్యాలను నిరంతరం పదునుపెట్టుకుంటాం. ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఈ సంకల్పానికి, నిబద్ధతకు ప్రతీక" అని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' వంటి సైనిక చర్యలు.. సంప్రదాయ, ఆధునిక సామర్థ్యాలను సమర్థవంతంగా మేళవించగల భారత శక్తిని నిరూపించాయని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. ఆత్మరక్షణకే కాకుండా అవసరమైనప్పుడు శత్రువుపై నిర్ణయాత్మకమైన దెబ్బకొట్టి, వారిని పూర్తిగా నిర్మూలించగల సత్తా భారత్‌కు ఉందని ఈ ఆపరేషన్ రుజువు చేసిందని పేర్కొన్నారు. యుద్ధనౌకల నిర్మాణం కేవలం నౌకాదళాన్ని బలోపేతం చేయడమే కాదని, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తినిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. "ఒక యుద్ధనౌక నిర్మాణం అంటే ఒక పరిశ్రమల వ్యవస్థను నిర్మించడమే. ఉక్కు, ఎలక్ట్రానిక్స్, సెన్సార్లు, ప్రొపల్షన్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్, లాజిస్టిక్స్ వంటి ఎన్నో రంగాలను ఇది ముందుకు నడిపిస్తుంది. దీనివల్ల లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది, కొత్త టెక్నాలజీలు అభివృద్ధి చెందుతాయి, దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుంది" అని తెలిపారు. భారత్‌ను నౌకా నిర్మాణ రంగంలో గ్లోబల్ హబ్‌గా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనికోసం 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'పై వేగంగా పనిచేస్తున్నామని చెప్పారు. మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్, షిప్‌బిల్డింగ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీమ్ వంటి పథకాల ద్వారా ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

## వియత్నాంలో ఘోర ప్రమాదం..



వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ స్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఒక మొబైల్ కంపెనీ తరఫున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో ఆంధ్రప్రదేశ్?కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు. మృతుల్లో మచిలీపట్నంకు చెందిన డిస్ట్రిబ్యూటర్ గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు. గిల్లి కిశోర్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం. కడపకు చెందిన నయీమ్ అనే డిస్ట్రిబ్యూటర్ ఆ బోటు ఎక్కకపోవడంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మొత్తం ఐదు బోట్లలో పర్యాటకులు విహారానికి వెళ్లగా, అందులో ఒక బోటు ప్రమాదానికి గురైంది. ఈ విషాద ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది. ప్రమాదాన్ని ధ్రువీకరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన కార్యాలయం, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొంది. బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను (o84 36 281 7930, o84 91 552 37 14, o84 33 452 0414, o84 91 308 9165) కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

## 17 ఏళ్లకే అరుదైన గౌరవం.. 300 మంది అమెరికా నేవీ క్యాడెట్స్‌కు లీడర్‌గా భారత సంతతి విద్యార్థిని

యూఎస్ నేవీ కెడెట్ ప్రోగ్రాంలో భారత సంతతి యువతికి అరుదైన గౌరవం

**17 ఏళ్ల రిధి చౌహాన్.. 300 మంది విద్యార్థుల బెటాలియన్‌కు కమాండింగ్ ఆఫీసర్**

న్యూయార్క్‌లోని హైస్కూల్‌లో అత్యున్నత క్యాడెట్ ర్యాంకు సాధించిన విద్యార్థిని

రాజస్థాన్ మూలాలున్న రిధి.. భవిష్యత్తులో నేవల్ ఆఫీసర్ కావడమే లక్ష్యమని వెల్లడి

అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ యువతి చిన్న వయసులోనే అరుదైన ఘనత సాధించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. 17 ఏళ్ల రిధి చౌహాన్, న్యూయార్క్‌లోని ఓ హైస్కూల్‌లో నేవీ జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్ (ఎన్‌జేఆర్ఓటీసీ) ప్రోగ్రాంలో అత్యున్నత క్యాడెట్ ర్యాంకును కైవసం చేసుకుంది. సుమారు 300 మంది విద్యార్థులున్న బెటాలియన్‌కు 'బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్'గా బాధ్యతలు చేపట్టింది. క్వీన్స్‌లోని బెంజమిన్ ఎన్. కార్డోజో హైస్కూల్‌లో ఈ గౌరవం దక్కించుకుంది. ఈ ఉన్నత పదవిలో భాగంగా రిధి వారానికి నాలుగు రోజులు తన బెటాలియన్‌లోని క్యాడెట్ల డ్రిల్ ప్రాక్టీస్, శిక్షణ, కార్యకలాపాలు, సంక్షేమాన్ని పర్యవేక్షిస్తుంది. ఇందుకోసం తరచుగా ఉదయం 7 గంటల కన్నా ముందే పాఠశాలకు చేరుకుంటుంది. యూఎస్ నేవీ సహకారంతో నడిచే ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం. ఈ పదవిని చేపట్టడం ద్వారా ఈ ప్రోగ్రాంలో విద్యార్థి నాయకత్వానికి అత్యున్నత శిఖరానికి చేరినట్టయింది. ఈ స్థాయికి రావడానికి ముందు రిధి అకడమిక్ కమాండర్, స్టెమ్ (ఎస్‌టీఈఎం) కమాండర్, ప్లాటూన్ లీడర్ వంటి పలు కీలక హోదాల్లో సమర్థవంతంగా పనిచేసింది. ఆమె అకడమిక్ కమాండర్‌గా ఉన్నప్పుడు, పాఠశాల బృందం వరుసగా రెండేళ్లు జాతీయ స్థాయి లీడర్‌షిప్ అండ్ అకడమిక్ బౌల్ రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. స్టెమ్ కమాండర్‌గా, యూనిట్ కోసం మొట్టమొదటి 'సీపెర్చ్' అనే అండర్‌వాటర్ రోబోట్‌ను నిర్మించడంలో క్యాడెట్లకు నాయకత్వం వహించింది. తన పదవీకాలంలో 200 మందికి పైగా తోటి క్యాడెట్లకు మార్గనిర్దేశం చేసింది.

## సంపాదకీయం


# డిజిటల్ కంచె!?

సమస్య ఎంత జటిలమైతే, ప్రజలు అంత సరళమైన పరిష్కారానికి తహతహలాడతారు. ఇది సహజ లక్షణం! కానీ జటిల సమస్యలకు సరళ పరిష్కారాలు దొరకవు; దొరికినట్టు కనిపించే పరిష్కారాలు తరచూ కొత్త సమస్యలకు బీజాలు వేస్తాయి. సోషల్ మీడియావల్ల టీనేజర్ల మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందా? దాన్ని అరికట్టేందుకు ఏం చేయాలనే ప్రశ్న ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, పరిశోధకులు, తల్లిదండ్రులను వేధిస్తున్న జటిల సమస్యే. కొన్నేళ్లుగా పలు దేశాల్లో ఈ వేదికలు యుక్తవయస్కుల్లో మానసిక ఆరోగ్య సంక్షోభాన్ని రాజేస్తున్నాయనే భావన బలంగా వేళ్లూనుకుంది. అయితే ఈ భావనలో ఎంత భాగం నిజంగా 'కారణం-ఫలితం' బంధమో, ఏ పరిస్థితుల్లో హాని జరుగుతుందో ఇంకా శాస్త్రీయ చర్చలోనే ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఆస్ట్రేలియా నిర్ణయాన్ని ప్రశంసించడం గమనార్హం. 2024లో ఆస్ట్రేలియా 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించింది. భారత్‌లోనూ అలాంటి నిషేధం రాబోతోందనడానికి మోదీ మాటలు సంకేతం కావొచ్చు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే ఈ దిశగా ఆలోచనలు చేశాయి. కానీ ఆసక్తికరమైన విషయం- ఆస్ట్రేలియాకు చెందిన మనస్తత్వ శాస్త్రవేత్తలు, డిజిటల్ ఆరోగ్య పరిశోధకులు, బాలల హక్కుల నిపుణులు, ఆన్‌లైన్ భద్రతా నిపుణులు నిషేధ చట్టాన్ని తీవ్రంగా విమర్శించారు. సోషల్ మీడియా వాడకం వల్ల పిల్లలకు హాని జరుగుతుందనడానికి విశ్వసనీయమైన ఆధారాలున్నా.. వయసు ఆధారిత నిషేధం విధిస్తే మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవన్నది వారి వాదన. నిజానికి ఆస్ట్రేలియా ఒక 'సహజ ప్రయోగం' నిర్వహిస్తోందనే చెప్పాలి. ఆ ప్రయోగపు తొలి ఫలితాలు నిషేధవాదులకు నిరుత్సాహం కలిగించేవే. నిషేధం అమల్లో ఉన్నప్పటికీ 12-16 ఏళ్ల వయసు పిల్లల్లో సుమారు 85 శాతం ఇప్పటికీ సోషల్ మీడియా వేదికలను వాడుతున్నట్టు లెక్కలున్నాయి. అంటే చట్టం కాగితాలకే పరిమితమైంది; నిషేధం విఫలమవడమే కాదు -పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను చీకట్లోకి, పర్యవేక్షణలేని మూలల్లోకి నెట్టే ప్రమాదమూ ఉంది.

నిషేధాన్ని సమర్థించేవారి వాదననూ కొట్టిపారేయలేం. పరిపూర్ణమైన శాస్త్రీయ ఆధారాల కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే, జరగరాని నష్టం జరిగాక ఏంచేయలేని పరిస్థితి ఎదురవుతుందన్నది వారి ఆందోళన. ఇందులోనూ నిజాయితీ ఉంది. ఇక్కడే.. మెజారిటీ నిపుణులు భిన్నమైన మార్గాన్ని సూచిస్తున్నారు. నిషేధాన్ని పక్కనపెట్టి, వేదికలపై 'సంరక్షణ బాధ్యత' (డ్యూటీ ఆఫ్ కేర్)ను కఠినంగా విధించాలి. పాఠశాల విద్యలో డిజిటల్ అక్షరాస్యతను భాగం చేయాలి. వినియోగదారులను వ్యసనపరులుగా మార్చే ఇంటర్‌ఫేస్ డిజైన్లను నియంత్రించాలి. మైనర్లకు అల్గారిథమ్ సిఫార్సుల బదులు కాలక్రమానుగత (క్రోనలాజికల్) ఫీడ్‌ను తప్పనిసరి చేయాలి. కంటెంట్ మోడరేషన్‌ను పటిష్ఠం చేయాలి. గోప్యతా రక్షణలను మెరుగుపరచాలి. సమర్థవంతమైన పేరెంటల్ కంట్రోల్స్‌ను ప్రవేశపెట్టాలి. ఈ సూచనల వెనుక బలమైన శాస్త్రీయ తర్కముంది. యుక్తవయస్కులపై సోషల్ మీడియా ప్రభావాన్ని అధ్యయనం చేసిన పరిశోధనల్లో అత్యధికం పరిశీలనాత్మక (అబ్జర్వేషనల్) అధ్యయనాలే. అలాంటి అధ్యయనాల్లో 'విలోమ కారణత్వం' అనే లోపం పొంచి ఉంటుంది. అంటే సోషల్ మీడియా వాడకంవల్ల కుంగుబాటు రావడం కాకుండా, ఇప్పటికే కుంగుబాటులో ఉన్న టీనేజర్లు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతుండవచ్చు. ఏది కారణమో, ఏది ఫలితమో తేల్చడం కష్టం. పైగా ఈ అధ్యయనాల్లో కనిపించిన సగటు ప్రభావాలు చాలా చిన్నవే. నిపుణులు మరో కీలకమైన అంశాన్నీ ఎత్తిచూపుతున్నారు: రోజుకు ఎన్ని గంటలు వాడుతున్నారన్నది కాదు అసలు ప్రశ్న. నిష్క్రియంగా స్క్రోల్ చేస్తూ కూర్చుంటున్నారా? లేక చురుగ్గా సంభాషణల్లో పాల్గొంటున్నారా; ఆదరించే, ప్రోత్సహించే సమూహాల్లో ఉన్నారా? లేక విషపూరితమైన, శత్రుపూరిత వాతావరణంలో చిక్కుకున్నారా? ఇవే హానిని నిర్ణయించే నిజమైన కొలమానాలు. అంటే సమస్య 'వాడకం'లో కాదు, 'వాడకపు తీరు'లో, 'వేదికల నిర్మాణం'లో ఉందన్నమాట. వయసు ఆధారంగా గేటు మూసేసే నిషేధం ఈ సూక్ష్మ భేదాలను పూర్తిగా విస్మరిస్తుంది.

నిజానికి సోషల్ మీడియా అనేది నాణేనికి రెండు ముఖాల్లాంటిది. అది నిద్రను చెడగొడుతుంది; సైబర్ వేధింపులకు ద్వారాలు తెరుస్తుంది; వ్యసనానికి బానిసలను చేసే సిఫార్సు అల్గారిథమ్‌లతో పిల్లలను గంటల తరబడి తెరకు అతికించి ఉంచుతుంది. ఇవన్నీ కాదనలేని చేదు నిజాలు. కానీ అదే సోషల్ మీడియా స్నేహాలను నిలబెడుతుంది. వ్యక్తిత్వాన్ని, గుర్తింపును అన్వేషించుకునే అవకాశమిస్తుంది; తోటివారి మద్దతు అందిస్తుంది; ఎల్‌జీబీటీక్యూఐఏం వంటి సమూహాలకు చెందిన పిల్లలకు తమలాంటివారితో అనుసంధానాన్ని, మానసిక ఆరోగ్య సమాచారాన్ని అందుబాటులోకి తెస్తుంది. ఒంటరితనంలో కూరుకున్న ఎందరో పిల్లలకు ఈ వేదికలే ఊపిరిపోశాయన్నదీ వాస్తవమే. నిషేధం విధిస్తే హానితోపాటు మేళ్లనూ కోల్పోతాం. కాబట్టి మొత్తం చిత్రం మిశ్రమంగా ఉంది; పరిష్కారాలు సరళంగా లేవు. భారత్‌లాంటి దేశానికి ఈ చర్చ మరింత కీలకం. ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా ఉన్న దేశం మనది; ఇక్కడ డిజిటల్ వేదికలు విద్యకు, ఉపాధికి, సమాచారానికి ప్రధాన ద్వారాలుగా మారాయి. వయసు ధ్రువీకరణ కోసం ఆధార్ వంటి గుర్తింపు వ్యవస్థలను వాడితే గోప్యతకు కొత్త ముప్పులు తలెత్తుతాయి; అమలు చేయలేని చట్టం చేస్తే చట్టంపట్ల గౌరవమే తగ్గుతుంది. ఆస్ట్రేలియా అనుభవం మనకు నేర్పుతున్న పాఠం స్పష్టం: 85 శాతం మంది పిల్లలు నిషేధాన్ని దాటి లోపలికి వస్తున్నప్పుడు, గేటువద్ద కాపలా పెంచడం కాదు చేయాల్సింది.. లోపలి ప్రాంగణాన్ని సురక్షితం చేయడం. ప్రభుత్వాలు 'ఎవరు లోపలికి రావచ్చు' అని నియంత్రించే బదులు, 'వేదికలు ఎలా పనిచేయాలి' అన్నదాన్ని మార్చాలి. లాభార్జనే పరమావధిగా పిల్లల దృష్టిని క్షణక్షణం వేటాడే అల్గారిథమ్‌లను కట్టడి చేయడం, వేదికల జవాబుదారీతనాన్ని చట్టబద్ధం చేయడం, పిల్లలకూ తల్లిదండ్రులకూ డిజిటల్ విజ్ఞతను నేర్పడం.. ఇదే శాశ్వతమైన, శాస్త్రీయమైన మార్గం. తలుపులు మూయడం సులభం; ఇంటిని సురక్షితం చేయడం కష్టం. కానీ పిల్లల భవిష్యత్తు విషయంలో సులభమైన దారి కాదు, సరైన దారే మనం ఎంచుకోవాలి!

## పనికొచ్చే పలుకు



# చెరగని అందం.. మన వ్యక్తిత్వమే!

నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న ప్రధాన సమస్య 'పర్ఫెక్షన్'. సోషల్ మీడియాలో అందంగా కనిపించాలి, ఇతరులకంటే మెరుగ్గా ఉండాలనే తాపత్రయంలో చాలామంది మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు. ఈ ఫిల్టర్ల ప్రపంచంలో బతుకుతున్న మనకు, హాలీవుడ్ ప్రముఖ నటి ఆన్ హాథ్‌వే చెప్పిన మాటలు కనువిప్పు కలిగిస్తున్నాయి. నిజమైన ఆనందం బాహ్య సౌందర్యంలో లేదు, మన అసలైన వ్యక్తిత్వంలోనే ఉంటుందని ఆమె గుర్తుచేశారు.

సాధారణంగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని ఉత్తమ క్షణాలను, ఎడిట్ చేసిన ఫోటోలను మాత్రమే షేర్ చేస్తుంటారు. సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్ల జీవనశైలితో తమను తాము పోల్చుకోవడంవల్ల చాలామందిలో అభద్రతాభావం పెరుగుతోంది. ఎల్లప్పుడూ అద్భుతంగా కనిపించాలనే ఈ ఒత్తిడి క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూ, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత కొన్నేళ్లుగా బాడీ పాజిటివిటీ, మెంటల్ హెల్త్‌పై విస్తృత చర్చ జరుగుతున్న నేపథ్యంలో, ఆన్ హాథ్‌వే గతంలో పంచుకున్న కొన్ని ఆలోచనలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.

నాటి ఆన్ హాథ్‌వే మాటలు.. నేటికీ ఆదర్శం

"నేను ఎప్పుడో పర్ఫెక్షన్ కోసం పోరాడటం మానేశాను. ఆ ఆలోచన నాకు ఇప్పుడు ఏమాత్రం ఆసక్తికరంగా అనిపించడం లేదు. ప్రతి ఒక్కరూ కేవలం ఫోటోల్లో అందంగా కనిపించడానికే ఆరాటపడుతున్నారు. అసలైన ఒత్తిడి అక్కడినుంచే మొదలవుతుందని నేను భావిస్తాను. సంతోషంగా ఉండండి. మీలా మీరు జీవించండి. జీవితంలో అంతకంటే చాలా పెద్ద విషయాలు ఉన్నాయి" అని బ్రెయిన్‌కోట్ వేదికగా ఆన్ హాథ్‌వే పేర్కొన్నారు.

ఈ హాలీవుడ్ స్టార్ మాటల వెనుక ఉన్న లోతైన అర్థాన్ని గమనిస్తే, మనం అనుకునే పర్ఫెక్షన్ అనేది ఒక నిరంతర భ్రమ మాత్రమే. ప్రతిదీ ఖచ్చితంగా ఉండాలని కోరుకోవడం మానసికంగా అలసటను కలిగిస్తుంది. సామాజిక మాధ్యమాల్లో కేవలం కొన్ని క్షణాల గుర్తింపు కోసం, లైకుల కోసం ఆరాటపడే క్రమంలో జీవితంలోని అసలైన అనుభూతులను కోల్పోతున్నామని ఆమె సున్నితంగా హెచ్చరించారు. ఫిల్టర్ల వెనుక దాక్కునే అందంకంటే, మన లోపాలను సైతం స్వీకరిస్తూ యథార్థంగా జీవించడమే గొప్ప విషయమని ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

మానసిక ప్రశాంతతకు 'స్వీయ అంగీకారమే' కీలకం

పరిశోధనల ప్రకారం కూడా, ప్రతి విషయంలో పర్ఫెక్ట్‌గా ఉండాలనుకునే మనస్తత్వం తీవ్ర ఒత్తిడి, ఆందోళన, మానసిక అలసటకు దారితీస్తుంది. మనల్ని మనం ఉన్నదున్నట్లుగా అంగీకరించినప్పుడే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకోగలమని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా వేడుకకు హాజరైనా, కెరీర్‌లో ముందుకు సాగుతున్నా.. ఇతరులు ఏమనుకుంటారు? అనే ఆలోచన కంటే, మన మనసుకు నచ్చినట్లు ఉండటమే ఎంతో మేలు.

క్రిస్టోఫర్ నోలన్ సినిమాతో బిజీగా ఆన్ హాథ్‌వే

ఇక వృత్తిపరమైన విషయానికొస్తే, ఆన్ హాథ్‌వే ప్రస్తుతం ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కిస్తున్న 'ది ఒడిస్సీ' చిత్రంలో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవైపు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉంటూనే, మరోవైపు సమాజానికి స్ఫూర్తినిచ్చేలా ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు నేటి యువతలో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తున్నాయి. బాహ్య సౌందర్యం కంటే నిజమైన ఆత్మవిశ్వాసమే ఒక మనిషిని అందంగా మారుస్తుందని ఈ ఆస్కార్ నటి మాటలు మనకు మరోసారి గుర్తుచేస్తున్నాయి.


# సగం ఆకాశం..! సగమే న్యాయం?



భారత విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో ఒక నిశ్శబ్ద విప్లవం -తరగతి గదుల్లో ఆడపిల్లల సంఖ్య అబ్బాయిలతో సమానంగా చేరడం. అఖిల భారత ఉన్నత విద్యా సర్వే (ఏఐఎస్‌హెచ్‌ఈ) 2023-24 తాజా గణాంకాలు ఈ చారిత్రక మలుపును ధ్రువీకరిస్తున్నాయి. గత దశాబ్దంలో మహిళల నమోదు ఏకంగా 42 శాతం పెరిగింది. 2014-15లో 1.57 కోట్లుగా ఉన్న సంఖ్య 2023-24నాటికి 2.24 కోట్లకు చేరింది. అదేకాలంలో పురుషుల నమోదు 1.85 కోట్లనుంచి 2.26 కోట్లకు చేరింది; అంటే వారి వృద్ధి రేటు 22.16 శాతం మాత్రమే. మహిళలు ఈ వృద్ధి రేటును సునాయాసంగా అధిగమించి, దేశ ఉన్నత విద్యా నమోదును రికార్డుస్థాయిలో 4.5 కోట్లకు చేర్చడంలో చోదకశక్తిగా నిలిచారు. నేడు భారత విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లోని మొత్తం విద్యార్థుల్లో దాదాపు సగంమంది (49.7 శాతం) యువతులే. లింగ సమానత్వ సూచీ (జెండర్ ప్యారిటీ ఇండెక్స్) 1.08కి చేరడం అంటే -ప్రతి 100మంది యువకులకు 108మంది యువతులు ఉన్నత విద్యలోకి అడుగుపెడుతున్నారన్నమాట. ఇది సామాన్య విజయం కాదు; తరతరాల పోరాటాల ఫలితం. ముఖ్యంగా అణగారిన వర్గాల విషయంలో ఈ ఘనత మరింత విలువైనది. షెడ్యూల్డ్ కులాల్లో మహిళా నమోదు 51.4 శాతం, షెడ్యూల్డ్ తెగల్లో ఏకంగా 75.7 శాతం పెరిగింది. ఒకప్పుడు ఇంటి గడప దాటడమే గగనమైన సామాజిక వర్గాల ఆడపిల్లలు నేడు డిగ్రీ పట్టాల కోసం కళాశాల మెట్లెక్కుతున్నారంటే, అది విద్యా హక్కు చట్టాలు, స్కాలర్‌షిప్ పథకాలు, తల్లిదండ్రుల ఆలోచనా ధోరణుల్లో వచ్చిన మార్పుల సమష్టి ఫలం. కానీ ఈ గణాంకాల వెలుగుల మధ్యే ఒక చేదు నిజం దాగి ఉంది. నమోదు సంఖ్యలు ఎంత ఘనంగావున్నా, కళాశాల గేటు దాటిన తర్వాత ఉపాధి అవకాశాల మసకదనమే ఉంటే.. ఈ విజయమంతా పైపై మెరుగులాగే మిగిలిపోతుంది. తరగతి గదిలో సాధించిన సమానత్వం, కార్యాలయంలో కనిపించకపోతే -సాధించిన డిగ్రీలు అలంకారప్రాయమే. సో, గణాంకాలను ఉత్సవంగా జరుపుకుంటూనే, లోతుల్లోకి వెళ్లి చూడాల్సిన సమయమిది!

లోతుగా చూస్తే కనిపించే మొదటి అసమతుల్యత -చదువుల ఎంపిక. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) విద్యార్థుల్లో మహిళలు 44 శాతం ఉన్నారన్నది నిజమే; కానీ ఈ సంఖ్య 'ఎస్' అక్షరం వైపు -అంటే జీవశాస్త్రం, రసాయన శాస్త్రంవంటి సంప్రదాయ సైన్సుల వైపు భారీగా ఒరిగి ఉంది. అక్కడ మహిళలు 54.6 శాతంతో మెజారిటీగా ఉన్నారు. కానీ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఇంజినీరింగ్, టెక్నాలజీ రంగాల్లో మాత్రం వారి వాటా కేవలం 31.1 శాతమే. ఆ రంగాలు నేటికీ పురుషాధిక్యంలోనే ఉన్నాయి. సంప్రదాయ సైన్సుల్లో గుమిగూడటం వల్ల మహిళలు కృత్రిమ మేధ, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ వంటి 'భవిష్యత్‌కు భరోసా ఇచ్చే' ఆర్థిక చోదక రంగాలకు దూరమవుతున్నారు. రేపటి ఉద్యోగ మార్కెట్‌ను ఏలబోయేది ఏఐ, డేటా సైన్స్, సాఫ్ట్‌వేర్ రంగాలే అయినప్పుడు, ఆ రంగాల ద్వారాల వద్దే మహిళల అడుగులు తగ్గిపోవడం ఆందోళనకరం. రెండో అసమతుల్యత -విద్యా సంస్థల అంతర్గత నిర్మాణంలో. విద్యార్థుల్లో 50-50 సమతూకం సాధించినా, బోధనా సిబ్బందిలో ప్రతి 100 మంది పురుష అధ్యాపకులకు కేవలం 82 మంది మహిళా అధ్యాపకులే ఉన్నారు. వైస్-ఛాన్సలర్లు, డైరెక్టర్లు, డీన్లువంటి అత్యున్నత నాయకత్వ స్థానాల్లో మహిళలు దాదాపు కనిపించరు. తరగతి గదిలో కూర్చున్న అమ్మాయికి పోడియం మీద, పాలనా పీఠాలమీద తనలాంటి వారు కనిపించకపోతే -'నేనూ అక్కడికి చేరగలను' అనే స్ఫూర్తి ఎక్కడి నుంచి వస్తుంది? విద్యా సంస్థలు ఇప్పటికీ పితృస్వామ్య నిర్మాణాలుగానే మిగిలిపోయాయనడానికి ఇదే నిదర్శనం. మూడో సమస్య -నాణ్యత. విద్యార్థుల వెల్లువ పెరిగిన కాలంలోనే ప్రైవేటు, నాసిరకం కళాశాలల సంఖ్య కూడా పేలుడులా పెరిగింది. వీటిలో అధ్యాపకుల తీవ్ర కొరత, పేలవమైన మౌలిక వసతులు సర్వసాధారణం. డిగ్రీ పట్టా చేతికందినా, నైపుణ్యాలు అందకపోతే ఆ చదువు ఉపాధి మార్కెట్‌లో నిలబడలేదు. ఈ మూడు అసమతుల్యతలూ కలిసి ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి... నమోదు గణాంకాల సంబరాల వెనుక, మనం నిజంగా ఆడపిల్లలకు సమాన అవకాశాల భవిష్యత్తును నిర్మిస్తున్నామా? లేక సంఖ్యల భ్రమలో మునిగి ఉన్నామా? అని!

ఈ ప్రశ్నకు అత్యంత కఠినమైన సమాధానం ఉపాధి గణాంకాల్లో దొరుకుతుంది. ఉన్నత విద్యకూ, సంఘటిత ఉద్యోగ మార్కెట్‌కూ మధ్య భారత్‌లో పెద్ద అగాధమే ఉంది. సామాజిక అంచనాలు, ఇంటి బాధ్యతల భారం, భద్రతా అవరోధాలు -వీటి కారణంగా మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు నేటికీ నిరాశాజనకంగానే ఉంది. 2025 పీఎల్‌ఎఫ్ఎస్ నివేదిక ప్రకారం.. క్రమబద్ధ వేతన ఉద్యోగాల్లో పురుషులదే ఆధిపత్యం. 26.5 శాతం పురుషులతో పోలిస్తే మహిళలు 18.2 శాతమే. సంపాదనలోనూ అంతరం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది: పురుషుల సగటు నెలవారీ ఆదాయం రూ.24,217 కాగా, మహిళలది రూ.18,353 మాత్రమే. ఇక 64.2 శాతం మహిళలు 'స్వయం ఉపాధి' కేటగిరీలో ఉన్నారని గణాంకాలు చెబుతున్నా, ఈ వర్గీకరణ అస్పష్టమైనది. ఇందులో వేతనం లేని ఇంటి పని, పొలం పనులు కూడా కలిసిపోయి ఉంటాయి. అంటే లెక్చర్ హాళ్ల నుంచి బయటికి వచ్చిన మహిళా గ్రాడ్యుయేట్లు నిజంగా ఎక్కడికి వెళ్తున్నారో ఈ గణాంకాలు చూపించలేకపోతున్నాయి. చదువుకున్న అమ్మాయి పెళ్లితో, పిల్లల పెంపకంతో, కుటుంబ ఒత్తిళ్లతో ఉద్యోగ మార్కెట్ నుంచి నిష్క్రమిస్తే -ఆమె డిగ్రీపై సమాజం పెట్టిన పెట్టుబడి అంతా వృథా. ఇది వ్యక్తిగత నష్టం మాత్రమే కాదు; జాతీయ ఆర్థిక నష్టం కూడా. మహిళా శ్రామిక భాగస్వామ్యం పెరిగితే జీడీపీ గణనీయంగా వృద్ధి చెందుతుందని ప్రపంచవ్యాప్త అధ్యయనాలు ఎప్పటి నుంచో ఘోషిస్తున్నాయి. కాబట్టి ఇప్పుడు బాధ్యత మారింది. 2.24 కోట్లమంది యువతులు క్యాంపస్‌లలో తమ స్థానాన్ని సాధించుకున్న తర్వాత, ఆ భారం విధాన నిర్ణేతలు, విద్యా సంస్థల అధిపతులు, పరిశ్రమ నాయకుల భుజాలపైకి చేరింది. ఇంజినీరింగ్, టెక్నాలజీ కోర్సుల్లో అమ్మాయిల చేరికను ప్రోత్సహించే లక్షిత స్కాలర్‌షిప్‌లు, మెంటర్‌షిప్ కార్యక్రమాలు; క్యాంపస్ నుంచి కార్యాలయం వరకూ భద్రమైన ప్రయాణ, పని వాతావరణం; పని ప్రదేశాల్లో శిశు సంరక్షణ సదుపాయాలు, సరళమైన పని విధానాలు; వివాహం-మాతృత్వం తర్వాత తిరిగి ఉద్యోగంలోకి వచ్చే మహిళలకు 'రిటర్న్‌షిప్' అవకాశాలు; బోధన, నాయకత్వ స్థానాల్లో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం -ఇవన్నీ కాగితాలమీది హామీలుగా కాక, క్షేత్రస్థాయి వాస్తవాలుగా మారాలి. తరగతి గది గడప వరకూ నడిచొచ్చిన ఆడపిల్ల అడుగులు, అక్కడితో ఆగిపోకూడదు. బోర్డు రూముల వరకూ, పరిశోధనశాలల వరకూ, నాయకత్వ పీఠాల వరకూ సాగాలి. నమోదు గణాంకాలు గర్వకారణమే; కానీ డిగ్రీలకు తగిన గౌరవప్రద ఉపాధి దక్కినప్పుడే ఆ గర్వానికి సార్థకత. చదువుల్లో సగం ఆకాశాన్ని అందుకున్న మన ఆడపిల్లలకు, సంపాదనలోనూ ఉద్యోగాల్లోనూ ఆ సగం వాటాను అందించడమే నిజమైన సమానత్వం. అదే వికసిత భారత్‌కు అసలైన కొలమానం కూడా! ▪




జబ్బు పడ్డాక వైద్యం చేయించుకోవడం కంటే శరీరాన్ని రోగాలు రాకముందే జాగ్రత్తగా చూసుకోవడం చౌకైన పని. ఇప్పుడే బరువులు ఎత్తుతూ వ్యాయామం చేయడం అలవాటు చేసుకుంటే.. భవిష్యత్తులో ఇతరులపై ఆధారపడే పరిస్థితి రాదు. నాణ్యమైన నిద్ర.. భవిష్యత్తులో వచ్చే మతిమరుపును దూరం చేస్తుంది. ప్రపంచంలో అన్నింటికంటే ఉత్తమమైన వైద్యం ముందు జాగ్రత్త మాత్రమే! ఆరోగ్యం అనేది అకస్మాత్తుగా పోయేది కాదు.. రోజూ మనం చేసే చిన్న చిన్న నిర్లక్ష్యాల ఫలితం. అలాగే ఆరోగ్యం అనేది ఒక్కరోజులో వచ్చేదీ కాదు.. ప్రతిరోజూ మనం వేసే జాగ్రత్త అడుగుల బహుమతి. నేటి చెమట చుక్కే.. రేపటి ఔషధం కంటే విలువైనది!

-మహాదేవ

## వింతల్లో వింతలు

# భయపెట్టే అమాయకుడు



ముళ్ల కవచంతో, భయపెట్టే రూపంతో గ్రహాంతర జీవిని తలపించే ఓ భారీ గొంగళి పురుగు ప్రకృతి ప్రేమికులను ఆశ్చర్యపరుస్తోంది. 'క్యాబేజ్ ట్రీ మాత్' అనే చిమ్మట లార్వా అయిన ఈ పురుగు 70 మిల్లీమీటర్ల పొడవు, 15 మిల్లీమీటర్ల మందంతో ప్రపంచంలోని అతిపెద్ద గొంగళి పురుగుల్లో ఒకటిగా నిలుస్తోంది. తెల్లటి ముళ్లతో నల్లగా, పసుపు ముళ్లతో ఎర్రగా -రకరకాల రంగుల్లో కనిపించే ఇది చూడటానికి ప్రమాదకరంగా అనిపించినా, పూర్తిగా హానిరహితం. దీని ముళ్లు మెత్తగా ఉంటాయి; ఆ భయంకర రూపం కేవలం శత్రువులను తరిమికొట్టే సహజ రక్షణ వ్యూహం మాత్రమే. విచిత్రమేమిటంటే -ఉష్ణమండల ఆఫ్రికా ప్రజలు దీన్ని పోషకాహారంగా తింటారు. ఆర్థికంగానూ దీనికి ప్రాధాన్యముంది. చెట్ల ఆకులను శరవేగంగా తినేసే ఈ పురుగు, పూర్తిగా పెరిగాక మట్టిలో దాక్కుని, అందమైన రెక్కల గోధుమరంగు చిమ్మటగా మారి బయటికి వస్తుంది. రూపం భయపెట్టినా -ప్రకృతి చెప్పే పాఠం: కనిపించేదంతా నిజం కాదు!

# భారత్ సున్నా.. ఐదో టీ20లోనూ అయ్యర్‌సేన చిత్తు

## దంచికొట్టిన బట్లర్, బ్రూక్ 4-0తో ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్

**సౌతాంప్టన్:** టీ20 వరల్డ్ చాంపియన్ భారత్‌కు మరో భంగపాటు. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో వరుసగా రెండో సిరీస్‌లోనూ జట్టుకు వైట్‌వాష్ తప్పలేదు. ఇంగ్లిష్ గడ్డపై చెత్తాటను కొనసాగించిన టీమిండియా శనివారం రాత్రి జరిగిన ఐదో, ఆఖరి టీ20లో 56 రన్స్ తేడాతో చిత్తుగా ఓడింది. జోస్ బట్లర్ (64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 131) అద్భుత శతకానికి తోడు కెప్టెన్ హ్యారీ బ్రూక్ (45 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సర్లతో 95 నాటౌట్) విజృంభించడంతో ఆతిథ్య జట్టు సిరీస్‌ను 4-0తో సొంతం చేసుకుంది. ఇంగ్లండ్ ఇచ్చిన 258 పరుగుల ఛేదనలో భారత్ 201/8 స్కోరుకే పరిమితమై ఓడింది. ఇషాన్ కిషన్ (35 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 56), హైదరాబాదీ తిలక్ వర్మ (25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 53) ఫిఫ్టీలు కొట్టినా జట్టుకు ఓటమి తప్పలేదు. వైభవ్ సూర్యవంశీ స్థానంలో తిరిగి జట్టులోకి వచ్చిన సంజూ శాంసన్ (27), కెప్టెన్ అయ్యర్ (28) పోరాడినా.. అభిషేక్ (3), శివమ్ దూబే (14), సూర్యాంశ్ షెడ్గే (7), అక్షర్ (3) చేతులెత్తేయడంతో జట్టుకు పరాభవం తప్పలేదు. సామ్ కరన్ మూడు వికెట్లతో దెబ్బకొట్టాడు. తొలుత బట్లర్, బ్రూక్ రెండో వికెట్‌కు 102 బంతుల్లోనే 233 రన్స్ జోడించడంతో ఇంగ్లండ్ 20 ఓవర్లలో



257/3 స్కోరు చేసింది. భారత బౌలర్లలో శివమ్ దూబే మాత్రమే రెండు వికెట్లతో రాణించాడు. బట్లర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, బ్రూక్‌కు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు దక్కాయి.

# చికిత జట్టుకు రజతం

మాడ్రిడ్: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4లో భారత ఆర్చర్, తెలంగాణ అమ్మాయి తానిపర్తి చికిత రజతంతో మెరిసింది. చికిత, ఏపీ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్‌తో కూడిన మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో ఈ పతకం అందుకుంది. వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం గెలిచిన యంగ్‌స్టర్ ప్రీతిక డబుల్ ధమకా మోగించింది. శనివారం జరిగిన కాంపౌండ్ టీమ్ ఫైనల్లో మూడో ర్యాంకర్ భారత్ 228-232తో ప్రపంచ 14వ ర్యాంకర్ కొలంబియా చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. ఈ మ్యాచ్‌లో ప్రీతిక ఆరు సార్లు 10 పాయింట్లు సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినప్పటికీ.. సీనియర్ ఆర్చర్లు జ్యోతి సురేఖ, చికిత లయ తప్పడం జట్టు విజయ అవకాశాలను దెబ్బతీసింది. ముఖ్యంగా స్టార్ ఆర్చర్ సురేఖ మూడు సార్లు మాత్రమే 10 పాయింట్లు కొట్టి నిరాశపరిచింది. వ్యక్తిగత కాంస్య పతక పోరులో ప్రీతిక 145-142తో ప్రపంచ 11వ ర్యాంకర్ హజల్ బురున్ (తుర్కియే)పై గెలిచింది.



## స్పోర్ట్స్

# క్రాంతి కమాల్.. ఇంగ్లండ్ ధమాల్

5 వికెట్లతో మెరిసిన యువ పేసర్

170 రన్స్‌కే ఆతిథ్య జట్టు ఆలౌట్

రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 154/1




లండన్: క్రికెట్ మక్కా లార్డ్స్ స్టేడియంలో ఇంగ్లండ్‌తో చారిత్రక టెస్టు మ్యాచ్‌ను భారత అమ్మాయిలు తమ చేతుల్లోకి తీసుకున్నారు. తొలి రోజు బ్యాట్‌తో మెప్పించిన టీమిండియా రెండో రోజు ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. పేసర్ క్రాంతి గౌడ్ (5/37) కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శనతో విజృంభించడంతో ఆతిథ్య జట్టును 170 పరుగులకే కుప్పకూల్చింది. దీంతో భారత్‌కు 115 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఇంగ్లిష్ టీమ్‌లో ఎమీ జోన్స్ (52), కెప్టెన్ సివర్ బ్రంట్ (44), మయా బుషెర్ (23) తప్ప మిగతా వాళ్లు తేలిపోయారు. అలీస్ కాప్సీ (9), హెథర్ నైట్ (6) నిరాశపరిచారు. భారత బౌలర్ల దెబ్బకు ఇంగ్లండ్ 33 పరుగుల వ్యవధిలోనే చివరి 5 వికెట్లు కోల్పోయింది. క్రాంతికి తోడు సయాలీ సత్ఘారే, స్నేహ్ రాణా చెరో రెండు వికెట్లతో ఆతిథ్య జట్టును దెబ్బకొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్.. శనివారం ఆట చివరకు 154/1 స్కోరు చేసింది. తన ఫామ్ కొనసాగించిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (69 బ్యాటింగ్ ) వరుసగా రెండో అర్ధ శతకంతో సత్తా చాటింది. అద్భుతమైన షాట్లతో ఇంగ్లండ్ బౌలర్లపై పైచేయి సాధించిన మంధాన తొలి వికెట్‌కు షెఫాలీ వర్మ (33)తో 88 పరుగులు, రెండో వికెట్‌కు యస్తికా భాటియా (39 బ్యాటింగ్)తో అజేయంగా 66 రన్స్ జోడించి జట్టును బలమైన స్థితిలో నిలిపింది. ప్రస్తుతం భారత్ మొత్తంగా 269 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.

# రీమేక్‌లకు దూరంగా ఉన్న టాలీవుడ్ స్టార్లు

టాలీవుడ్‌లో రీమేక్ సినిమాలకు ఎప్పటినుంచో ప్రత్యేక స్థానం ఉంది. ఒక భాషలో సూపర్ హిట్ అయిన కథలను మరో భాష ప్రేక్షకులకు అందించేందుకు పలువురు స్టార్ హీరోలు రీమేక్‌లను ఎంచుకున్నారు. అయితే అదే సమయంలో కొందరు అగ్ర హీరోలు మాత్రం తమ కెరీర్ మొత్తం ఒరిజినల్ కథలపైనే నమ్మకం ఉంచుతూ ప్రత్యేక గుర్తింపును సంపాదించారు. ఇప్పటివరకు ఒక్క రీమేక్ సినిమాలో కూడా నటించకుండా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న హీరోలు కూడా కొందరున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు దాదాపు 25 ఏళ్లకు పైగా సినీ కెరీర్ లో ఒక్క రీమేక్ సినిమా కూడా చేయలేదు. ఒక్కడు నుంచి పోకిరి, దూకుడు, శ్రీమంతుడు, భరత్ అనే నేను, సర్కారు వారి పాట, గుంటూరు కారం వరకు ఆయన చేసిన





సినిమాలన్నీ ఒరిజినల్ కథలే. కథల ఎంపికలో కొత్తదనం, డైరెక్టర్ల విజన్‌పై నమ్మకం ఉంచడం మహేష్ స్పెషాలిటీగా భావిస్తారు.

ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూడా దాదాపు రెండు దశాబ్దాల కెరీర్‌లో రీమేక్‌లకు దూరంగానే ఉన్నారు. ఆర్య, దేశముదురు, జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో, పుష్ప వంటి సినిమాలన్నీ ఒరిజినల్ కాన్సెప్ట్‌లతోనే తెరకెక్కాయి. కథలో వైవిధ్యం, పాత్రల్లో కొత్తదనం ఉండేలా చూసుకోవడం బన్నీ కెరీర్‌లో ప్రధాన బలంగా నిలిచింది. ఇక టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ కూడా తన 15 ఏళ్ల సినీ కెరీర్ లో ఇప్పటివరకు రీమేక్‌లకు అవకాశం ఇవ్వలేదు. పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి, గీత గోవిందం, ట్యాక్సీవాలా, ఖుషి వంటి సినిమాలన్నీ ఒరిజినల్ కథలతోనే ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. యూత్ ను ఆకట్టుకునే కొత్త కాన్సెప్ట్‌లను ఎంచుకోవడంలో విజయ్ ప్రత్యేక శైలిని కొనసాగిస్తున్నారు. అయితే ఎవరైనా సరే రీమేక్‌లు చేయడం తప్పు కాదు. చాలా మంది హీరోలు ఆ రీమేక్స్ తో సక్సెస్‌లు కూడా అందుకున్నారు. కానీ మహేష్ బాబు, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ మాత్రం ఒరిజినల్ కథలతోనే తమ బ్రాండ్‌ను నిర్మించుకోవడం విశేషం. మారుతున్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కొత్త కథలకు ప్రాధాన్యం ఇస్తూ తమ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న ఈ హీరోలు, కథ ఎంపికలో తమదైన ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com